


# విజయభాను

హైదరాబాద్, శుక్రవారం 11-08-2017 | VIJAYABHANU DAILY HYDERABAD EDITION | సంపుటి : 36 సంచిక : 330 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## నంద్యాల ఎన్నికల్లో మాటల తూటాలు



**చంద్రబాబు.. కాదు కాదు.. మోసబాబు**

**బాబు దుర్నీతిని లౌక్యంగా తిప్పికొట్టాలి**

**న్యాయానికీ, ధర్మానికీ ఓటు వేయండి**

**ప్రతిపక్ష నేత వైఎస్ జగన్**

నంద్యాల: ఎమ్మెల్యేలను కొనుగోలు చేసినట్టే ప్రజలను కూడా కొనుగోలు చేయొచ్చన్న అహంకారంతో చంద్రబాబు మూటలు, మూటలు డబ్బులతో నంద్యాలకు వచ్చారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. 'ఉప ఎన్నికలు రాగానే మహిళలను మోసం చేయడానికి చంద్రబాబుకు తరువాయి 2లో

## శ్రీరాంసాగర్‌కు త్వరలో జలకళ

### ప్రాజెక్టు పునర్జీవ పథకానికి సీఎం శంకుస్థాపన

పోచంపాడ్: కోటి ఎకరాల మాగాణి దిశగా తెలంగాణ మరో కీలక అడుగు వేసింది. శ్రీరాం సాగర్ మళ్లీ జలకళతో ఉట్టిపడనుంది. నీటి ఎద్దడితో ఉన్న శ్రీరాంసాగర్‌కు మళ్లీ జీవం పోసే ప్రక్రియకు సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టారు. ప్రాజెక్టు కింద ఉన్న ఆయకట్టుకు మళ్లీ ఆయువు పోశారు. దానిలో భాగంగానే ఆయన ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకానికి శంఖుస్థాపన చేశారు.

తెలంగాణ సీఎం అపర భగీరథుడు అనడానికి ఇదే నిదర్శనం. గత పాలకుల హయాంలో పల్లానికి పారే నీటిని ఇచ్చెటోడే గతిలేకుండే. అలాంటిది పల్లం నుంచి ఎగువకు రివర్స్‌పంపింగ్ చేసి రైతులకు నీరు ఇవ్వడమనేది అపర భగీరత యత్నమే. ఇది సీఎం కేసీఆర్ వల్లే సాధ్యమవుతున్నది. ఇంతటి ప్రతిష్టాత్మకమైన పథకానికి సీఎం తరువాయి 2లో



## తెరాస సర్కారువి గిరిజన వ్యతిరేక విధానాలు



**భాజపా శాసనమండలి పక్షనేత రామ్‌చందర్‌రావు**

గన్‌ఫౌండ్రీ: రాష్ట్రంలో తెరాస ప్రభుత్వం గిరిజన వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని భాజపా శాసన మండలి పక్షనేత, గ్రేటర్ భాజపా అధ్యక్షుడు రామ్‌చందర్ రావు విమర్శించారు. గిరిజన ఉపప్రణాళిక నిధులను దారి తరువాయి 2లో

## డ్రగ్ రాకెట్ సూత్రధారి గాబ్రియేల్ అరెస్ట్

హైదరాబాద్: గత నెల రోజులుగా హాట్ టాపిక్‌గా మారిన హైదరాబాద్ డ్రగ్స్ దందాలో మరో కీలక అరెస్టు జరిగింది. నైజీరియన్ల డ్రగ్ రాకెట్లో సూత్రధారిగా భావిస్తున్న గాబ్రియేల్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ డ్రగ్స్ రాకెట్ వెలుగులోకి వచ్చినప్పటి నుంచి అజ్ఞాతంలో ఉన్న గాబ్రియేల్‌ను తాజాగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గత కొద్ది కాలంగా హైదరాబాద్‌లోనే ఉంటూ నైజీరియన్ ముఠాలకు గాబ్రియేల్ డ్రగ్స్ సరఫరా చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఎక్సైజ్ అధికారులకు పట్టుబడిన నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు హైదరాబాద్ శివారులోని కౌకూర్‌లో ఓ అపార్ట్‌మెంట్లో ఉన్న గాబ్రియేల్‌తో పాటు అతడి ప్రియురాలిని కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. గాబ్రియేల్ నుంచి భారీగా కొకైన్, హెరాయిన్తో పాటు ల్యాప్‌టాప్, పాస్‌పోర్ట్ స్వాధీనం చేసుకున్నారు.

ఢిల్లీ నుంచి ఇటీవలే నగరానికి వచ్చిన గాబ్రియేల్ యాప్రాల్ సమీపంలోని కౌకూర్



గ్రీన్‌హుడ్ అపార్ట్‌మెంట్‌లో ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. గాబ్రియేల్ ఇచ్చే సమచారం నైజీరియన్ డ్రగ్ రాకెట్ వ్యవహారంలో కీలకం అవుతుందని పోలీసులు భావిస్తున్నారు. గత రెండేళ్లుగా తరువాయి 2లో

## అజాత శత్రువు మాధవ్

### ఘనంగా ఎమ్మెల్సీ మాధవ్ జన్మదిన వేడుకలు ■ పార్టీలకతీతంగా హాజరైన ప్రముఖులు



ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చొక్కాకుల వెంకటరావు, విజయభాను సంస్థల అధినేత బి. చంద్రశేఖర్, అంతకాపల్లి సర్పంచ్ చొక్కాకుల గోవింద్, సీనియర్ జర్నలిస్టు శశాంక్ మోహన్, బిజెపి నగర మహిళా మోర్చా అధ్యక్షురాలు జి. ప్రేమ కుమారి, చొక్కాకుల ఛారిటబుల్ ట్రస్ట్ సెక్రటరీ సిహెచ్. రామకృష్ణ, అప్పలకొండ యాదవ్, తదితరులు వార్త 2వ పేజీలో

## గ్రామాన్ని ఖాళీ చేయిస్తున్న భారత సైన్యం



న్యూఢిల్లీ : చైనాతో ప్రతిష్టంభన నేపథ్యంలో భారత సైన్యం కీలక చర్య చేపట్టింది. భారత్-భూటాన్-చైనా ట్రై జంక్షన్‌కు సమీపంలోని ఓ గ్రామాన్ని ఖాళీ చేయాలని ఆదేశించింది. విశ్వసనీయ వర్గాలు తెలిపిన సమాచారం ప్రకారం నాథంగ్ గ్రామ తరువాయి 2లో


### టేకిట్-ఈజీ



మనం ఇన్నేళ్లుగా జైల్లో ఉన్నామని నువ్వేం బాధపడకురా! మనక్కూడా మంచి రోజులు రానున్నాయి. చూద్దాం!!

## మట్టి గణపతుల పంపిణీ

### ఏర్పాట్లు చేస్తున్న జీహెచ్ఎంసీ



హైదరాబాద్: వినాయక చవితికి అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. జీహెచ్ఎంసీ నగరవాసులకు ఉచితంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు, జలమండలి, భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి పకడ్బందీ చర్యలు చేపడుతున్నాయి. మండపం నుంచి విగ్రహం వూరేగింపుగా వచ్చి ఆయా ప్రాంతాల్లోని చెరువుల్లో నిమజ్జనం అయ్యే వరకు అన్ని దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు చేయనున్నారు. గతేడాది మాదిరే హుస్సేన్‌సాగర్ వద్ద ఒకేరోజులో నిమజ్జనం పూర్తయ్యేలా చూడాలని అధికారులు నిర్ణయించారు. పండగ ఏర్పాట్లపై బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ కమిషనర్ బి.జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి నాలుగు కిలోమీటర్లకు ఓ అధికారిని పర్యవేక్షణ కోసం నియమిస్తున్నామన్నారు. ఖైరతాబాద్ గణేశుడి విగ్రహాన్ని సమయానికి కదిలించి శోభాయాత్ర చేపట్టేలా చూడాలన్నారు. రూ.5లక్షలతో 8అంగుళాలు తరువాయి 2లో



# అజాత శతృవు మాధవ్

## - ఘనంగా ఎమ్మెల్సీ మాధవ్ జన్మదిన వేడుకలు
## - పార్టీలకతీతంగా హాజరైన ప్రముఖులు



విశాఖపట్నం: కుల, మత, జాతి, వర్ణ, వర్గ విభేదాలకు దూరంగా ఉంటూ పార్టీలకతీతంగా అందరి ఆదరాభిమానాలు చూరగొంటూ నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి విద్యార్థి నాయకుడి నుంచి ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థాయికి ఎదిగిన పివిఎన్ మాధవ్ ప్రజల గుండెల్లో అజాత శతృవుగా తనదైన శైలిలో పయనిస్తున్నారని ప్రముఖ వ్యాపారవేత్త, చొక్కాకుల ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చొక్కాకుల వెంకటరావు ఎమ్మెల్సీ మాధవ్ వ్యక్తిత్వాన్ని కొనియాడారు. గురువారం ఎమ్మెల్సీ మాధవ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన నివాసంలో పుష్పగుచ్ఛాన్నిచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చొక్కాకుల వెంకటరావుతో పాటు ఆయన సోదరుడు, సబ్బవరం మండలం, అంతకాపల్లి సర్పంచ్ చొక్కాకుల గోవింద్ ఈ జన్మదినోత్సవ వేడుకలకు హాజరై మాధవ్‌కు దుశ్శాలువ కప్పి పుష్పగుచ్ఛాన్నిచ్చి తమ అభినందనలు తెలియజేశారు. అనంతరం మాధవ్‌కు పలువురు బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పలు విద్యార్థి సంఘాల నాయకులు మాధవ్‌కు జన్మదిన శుభాకాంక్షలుతెలియజేశారు.

## ఉద్యమించిన కరవె కార్యకర్తలు



బెంగళూరు : భారతీయ స్టేట్ బ్యాంకు శాఖల్లో కన్నడకన్నా హిందీకి ప్రాధాన్యం ఎక్కువ ఇస్తున్నారని ఆరోపిస్తూ కరా?టక రక్షణ వేదికె (కరవె) కార్యకర్తలు సెయింట్ మార్క్స్ రోడ్డులోని బ్యాంకు ప్రాంతీయ కార్యాలయం ముందు ధర్నాకు దిగారు. కన్నడిగులకు ఉద్యోగ అవకాశాలను కల్పించటం, బ్యాంకులో ఉద్యోగులందరూ కన్నడలోనే వ్యవహారాలను నిర్వహించేందుకు పెద్ద పీట వేసేందుకు చర్యల్ని తీసుకోవాలని ఆందోళనకారులు డిమాండు చేశారు. కేవలం ఆంగ్లం, హిందీ మాత్రమే మాట్లాడు తున్న అధికారులు కన్నడ ఉద్యోగులకు ప్రాధాన్యమివ్వటం లేదని తప్పుపట్టారు. ఆందోళన తరువాత బ్యాంకు అధికారులకు వారు వినతిపత్రాన్ని అందించారు. బ్యాంకుల్లో పలు ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, పోటీ పరీక్షలను రాసేందుకు కన్నడిగులను ఆహ్వానిస్తున్నామని బ్యాంకు అధికారులు ఈ సందర్భంలో ప్రకటించారు.

## ఇక ఆన్‌లైన్‌లో
# వాహనాలకు పర్మిట్‌లు

కటక్ : బస్సులు, లారీలు యజమానులకు ఆన్‌లైన్‌లో రోడ్ పర్మిట్‌లు ఇచ్చేందుకు ఒడిశా పర్మిట్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఓపీఎమ్ఎస్) ఎంతగానో సహాయ పడుతుందని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి నరసింహచరణ్ సాహు అన్నారు. కటక్‌లో రవాణా కమిషనర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఓపీఎంఎస్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్య మంత్రి నవీన్ పట్నాయక్ అన్ని రంగాల్లో ఉత్తమ సేవలు అందించడంతోపాటు స్వచ్ఛత కాపాడేందుకు కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. ఓపీఎంఎస్ ఏర్పడడంతో వాహనదారులు ఆన్‌లైన్‌లో పర్మిట్లు పొందడం సులువవుతుందన్నారు. పర్మిట్ రెన్యువల్ కూడా ఇదే విధానంలో చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రవాణా కమిషనర్ మధుసూధన్ పాఢి ప్రసంగిస్తూ ఆన్‌లైన్‌లో తాత్కాలిక, స్థాయి పర్మిట్లు కల్పించేందుకు ఏర్పాట్లు చేశామని చెప్పారు. కార్యక్రమంలో ప్రైవేటు బస్సుల యజమానుల సంఘం, లారీల యజమానుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## విజ్ఞానానికి బడ్జెట్ తగ్గించొద్దు

బ్రహ్మపుర : ప్రాధాన్యమున్న విజ్ఞానానికి సంబంధించిన అంశాలను కేంద్రం నిర్లక్ష్యం చేస్తోందని, ఈ రంగానికి బడ్జెట్‌ను క్రమేపీ తగ్గిస్తోందని స్థానిక మానవతావాది, హేతువాద సంఘటన్ (హెచ్ ఆర్ఓ) ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్ఆర్ఓ ఆధ్వర్యంలో 'మార్చ్ ఫర్ సైన్స్' కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక కళ్లికోట క్లస్టర్ విశ్వవిద్యాలయం మార్గంలో హెచ్ఆర్ఓ ప్రతి నిధులు ప్లకార్డులు చేతబట్టి ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్ఓ ప్రతినిధులు ఈ.టి.రావు. రాజా సురేష్, కె.నందేశు సేనాపతి, అబనీకుమార్ గయా తదితరులు పాల్గొన్నారు.

## త్యాగధనులను స్మరించడం మన ధర్మం

బళ్లారి : క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న మహాత్ములను స్మరించుకోవడం మన ధర్మమని విధాన పరిషత్తు సభ్యుడు అల్లం వీరభద్రప్ప పేర్కొన్నారు. క్విట్ ఇండియా ఉద్యమం 75వ వార్షికోత్సవం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. తొలుత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిషు వారు భారతదేశం వదలి వెళ్లండి అని మహాత్మాగాంధీ నినాదం ఇవ్వడంతో, ఆయన వెంట భారతీయులు చీమల దండుగా ముందుకు కదిలారన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నేతలు అసుండి నాగరాజు, కల్లకంబ పంపాపతి, ఆర్.మంజు నాథ తదితరులు క్విట్ ఇండియా ఉద్యమంపై మాట్లాడారు. ఈ కార్యక్రమానికి కె.పి.సి.సి. ప్రధాన కార్యదర్శి కమలమ్మ, కుమారస్వామి, మారెణ్ణ, దొడ్డరామణ్ణ, మహేశ్వరస్వామి, ప్రభాకర్, మల్లికార్జున, వీరేష్, మంజునాథ, యతేంద్ర, బసప్ప, గోపాలకృష్ణ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విధానపరిషత్తుకు 31న ఉప ఎన్నిక

బెంగళూరు : విధానపరిషత్తులో భాజపా తరపు సభ్యురాలు విమలాగౌడ మృతితో ఖాళీ ఏర్పడిన స్థానానికి ఈనెల 31న ఉప ఎన్నిక నిర్వహిస్తారు. విధానసభ నుంచి ఈ ఎన్నిక ప్రత్యేకించడం ఇక్కడ గమనార్హం. 14న నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఈ ప్రక్రియ 21తో పూర్తవుతుంది. 22న నామినేషన్ల పరిశీలన, 24న ఉపసంహరణ, పోలింగు 31న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగుతుంది. ఓట్లు లెక్కింపు అదే రోజు సాయంత్రం అయిదు గంటలకు ప్రారంభించి ఫలితాలు వెల్లడిస్తామని సంబంధిత అధికారి ప్రకటించారు.

పలువురు ప్రయత్నం..

ఎగువ సభ ఒక స్థానానికి ఈ నెల 31న జరగనున్న ఉప ఎన్నికలో పోటీకి కాంగ్రెస్ పార్టీలో పలువురు ప్రయత్నిస్తున్నారు. భాజపా సభ్యులు విమలాగౌడ మృతి కారణంగా ఉప ఎన్నిక అనివార్యమైంది.

విధానసభలో పార్టీల బలాబలాల రీత్యా కాంగ్రెస్ పార్టీ అవలీలంగా ఆ స్థానానిన సొంతం చేసుకోనుంది. పార్టీ వర్గాల కథనం ప్రకారం మాజీ మంత్రులు రాణిసతీశ్, బి.కె.చంద్రశేఖర్, మాజీ శాసనసభ్యులు నంజయ్యన మఠ, డాక్టర భారతీ శంకర్, అల్లమ ప్రభు పాటిల్, నజీర్ అహ్మద్, సుమ వసంత్, సిద్ధరామయ్య సన్నిహితుల్లో ఒక్కరైన బి.ఎస్. శివణ్ణ టిక్కెట్టు కోసం ప్రయత్నాల్ని ప్రారంభించారు.

ఎన్నికైన అభ్యర్థి పదవి గడువు వచ్చే ఏడాది జూన్ వరకూ మాత్రమే ఉంటుంది. ప్రత్యర్థి భాజపా, జనతా దళ్ అభ్యర్థుల వివరాలూ తెలియాల్సి ఉంది.

## మహామహుల ఆదర్శాలు పాటించాలి

కటక్ : దేశానికి, ప్రజలకు సేవలందించేందుకు త్యాగాలు చేసిన మహామహుల ఆదర్శాలు అనుసరిస్తూ రాష్ట్రాభివృద్ధికి, ప్రజల ఉన్నతికి యువత కృషి చేయాలని బిజు యువ జనతాదళ్ కటక్ జిల్లా అధ్యక్షుడు జ్ఞానేంద్ర గిరిగోస్వామి పిలుపునిచ్చారు. క్రాంతిదివస్ సందర్భంగా టౌన్‌హాల్ ప్రాంగణంలో బిజు యువజనతాదళ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఇదే కార్యక్రమంలో బిజు యువజనతాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఎలీనా దాస్ మాట్లాడుతూ రాష్ట్ర భవిత యువతపై ఆధారపడి ఉందన్నారు. యువతకు సన్మార్గం చూపించేందుకు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నారని, యువత ఉన్నతే లక్ష్యంగా ఆయన కృషి చేస్తున్నారన్నారు.

ముఖ్యమంత్రి ఆశయాలు నెరవేర్చేందుకు యువత ఆయనకు తోడుగా ఉండాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమానికి స్థానిక శాసన సభ్యులు దెవాశిష్ సామంత్రాయ్, ప్రభాత్‌రంజన్ బిశ్వాళలు పాల్గొని క్రాంతి దివస్‌పై వివరించారు. కార్యక్రమంలో కటక్ జిల్లాకు చెందిన బిజు యువజనతాదళ్ కార్య కర్తలు పాల్గొన్నారు

## మరో నిర్లవణీకరణ ప్రాజెక్టు



చెన్నై : విళుపురం, కడలూరు జిల్లాల్లో రూ.వెయ్యి కోట్లతో నిర్లవణీకరణ ప్రాజెక్టు అమలు చేయనున్నట్టు ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి ప్రకటించారు. విళుపురంలో జరిగిన ఎంజీఆర్ శత జయంత్యుత్సవాలలో ఆయన మాట్లాడుతూ... విళుపురం, కడలూరు జిల్లాల్లోని మున్సిపాలిటీలు, పట్టణ పంచాయతీలు, గ్రామీణ ప్రాంతాల కోసం రోజుకు 100 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన సముద్రపు జలాలను మంచినీరుగా మార్చే పథకాన్ని రూ.వెయ్యి కోట్లతో చేపట్టనున్నట్టు తెలిపారు. విళుపురం మున్సిపాలిటీలోని విస్తరణ ప్రాంతాలకు రూ.198 కోట్లతో భూగర్భ డ్రైనేజీ పథకాన్ని ప్రకటించారు. కార్యక్రమంలో భాగంగా పలు ప్రభుత్వ సంక్షేమ పథకాల సాయాలను లబ్ధిదారులకు అందించారు. వివిధ శాఖలకు చెందిన పథకాలకు శంకుస్థాపన చేశారు. శాసన సభ సభాపతి ధనపాల్, రాష్ట్రమంత్రులు సీవీ షణ్ముఖం, ఎస్పీ వేలుమణి, ఆర్బీ ఉదయ కుమార్, కామరాజ్, ఎంసీ సంపత్, సెల్లూర్ రాజు, దిండుకల్ శ్రీనివాసన్, డి.జయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 'అనుమతిస్తే హంపీని శిల్పారామంగా మార్చుతాం'

హొసపేటె : మమ్మల్ని ఇక్కడి నుంచి వెళ్లగొట్టకుండా ఓ అవకాశం ఇస్తే హంపీని హైదరాబాద్‌లోని శిల్పారామంగా మార్చుతామని హంపీ నివాసులు జిల్లా అధికారిని కోరారు. హంపీలోని శివరామ అవ ధూత ఆశ్రమంలో అక్కడి నివాసులతో జిల్లా అధికారి ఏర్పాటు చేసిన సమాలోచన సమావేశంలో వారు మాట్లాడారు. 2012లోనే ఇక్కడి నుంచి చాలా కుటుంబాలను వెళ్లగొట్టారు. ఇప్పుడు కొత్తగా ఉన్నవారిని కూడా వెళ్లగొట్టండని న్యాయ స్థానం ఉత్తర్వులు జారీ చేసింది. ఇలాగైతే హంపీపైనే ఆధారపడ్డ తాము ఎక్కడికి వెళ్లాలని ఆవేదన వెళ్లగక్కారు. హంపీ కేవలం పర్యాటక క్షేత్రమే కాదు. మూడుపూట్ల విరూపాక్షేశ్వరుడు పూజలందుకునే పుణ్యక్షేత్రం. దక్షిణ కాశీగా పేరుగాంచిన హంపీలో ప్రతినిత్యం ఏవ్కెనా ధార్మిక విధి విధానాలు జరుగుతూనే ఉంటాయి. ప్రత్యక్ష్యంగా, పరోక్షంగా వందలాది కుటుం బాలకు ఉపాధి కల్పిస్తోంది. ఇక్కడ మత్తు పదార్థాల విక్రయం, ఇతర అసాంఘిక కార్య కలాపాలు జరుగుతున్నాయని కొందరు న్యాయ స్థానానికి ఫిర్యాదు చేసిన నేపథ్యంలో న్యాయ స్థానం ఖాళీ చేయించండని జిల్లా యంత్రాం గానికి సూచనలు ఇచ్చింది. ఇక్కడ అలాంటివేవి జరగటం లేదు. అది కేవలం కల్పితమని అన్నారు. జిల్లా యంత్రాంగం సూచనలతో కొందరు రిసార్టుల యాజమానులు హైదరా బాద్‌లోని శిల్పారామానికి వెళ్లి వచ్చారు.

అక్కడ ఉన్నట్లు ఇక్కడ అన్ని ఏర్పాట్లు చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నాం. ప్రపంచ వారసత్వ ప్రాంతానికి మచ్చ రాకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు. వారి విన్నపాలు విన్న అనంతరం జిల్లా అధికారి డాక్టర్ రామ్ ప్రశాత్ మనోహర్ మాట్లాడుతూ ఇక్కడి వారిని వెంటనే ఖాళీ చేయించాలని న్యాయ స్థానం స్పష్టమైన ఆదే శాలు జారీ చేసింది. లేనిపక్షంలో న్యాయస్థానం ఆదేశాలు పాటించక తప్పదని అన్నారు.

మొదటి పేజీ తరువాయి

## శ్రీరాంసాగర్‌కు త్వరలో జలకళ

కేసీఆర్ ఇవాళ శ్రీకారం చుట్టడం తెలంగాణ రైతుకు ఒక వరం లాంటిది. 16 లక్షల ఎకరాలకు సాగు నీటిని అందించే అదుతే పథకానికి రూపకల్పన చేయడం తెలంగాణ వ్యవసాయానికే ప్రాణం పోయడం వంటిది

పోచంపాడు ప్రాజెక్టుకు రెండు వేల కోట్ల ఖర్చు చేస్తున్నారు. ప్రాజెక్టు నవీకరణ కోసం వెయ్యి కోట్లు ఖర్చు చేయనున్నారు. స్టేజ్-2 కెనాల్ ఆధునీకరణకు కూడా మరో వెయ్యి కోట్లు ఖర్చు చేస్తారు. ఈ స్కీమ్ కింద గోదావరి జలాలను ప్రతి రోజు ఓ టీఎంసీ చొప్పున లిఫ్ట్ చేస్తారు. కాళేశ్వరం నుంచి ఎసారెస్పీ మధ్య ఉన్న రూట్లో మొత్తం మూడు లిఫ్టులను నిర్మించనున్నారు. కేవలం 40 ఎకరాల్లోనే ఆ లిఫ్టులను నిర్మించడం విశేషం.

నిజామాబాద్ జిల్లా మెండోరా మండలంలోని పోచంపాడ్‌లో మధ్యాహ్నం బహిరంగ సభ జరగనుంది. పోదాం పావె జాతర.. పోచంపాడ్ జాతర.. అన్నట్టు ప్రాజెక్టు పరీవాహక జిల్లాలనుంచి భారీగా రైతుల తరలి వస్తున్నారు. 60 ఎకరాల సువిశాల మైదానంలో బహిరంగసభాస్థలిని సిద్ధంచేశారు. 1.10 గంటలకు భారీ బహిరంగసభను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించనున్నారు.

## మట్టి గణపతుల పంపిణీ

ఎత్తు ఉండే 14వేల విగ్రహాలు, 18అంగుళాలు ఎత్తు ఉండే 250 విగ్రహాలు సిద్ధంగా ఉంచామని, వాటిని ప్రజలకు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు వివరించారు. మండపాల నుంచి నిమజ్జన కోనేరులకు, చెరువులకు, హుస్సేన్‌సాగర్‌కు అనుసంధానమయ్యే అన్ని దారుల్లో రహదారుల మరమ్మతుల్ని వేగంగా పూర్తి చేస్తామని తెలిపారు. అలాగే వీధి దీపాల ఏర్పాటు, ఎల్ఈడీ దీపాలతో అలంకరణ పనులు ఇప్పటికే ప్రారంభమైనట్లు వివరించారు. నగర పోలీస్ కమిషనర్ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. మండపం నిర్వాహకులంతా సంబంధిత పోలీస్ స్టేషన్ నుంచి అనుమతి తీసుకుని విగ్రహం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో క్రేన్‌లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జలమండలి ఎండీ దానకిషోర్ మాట్లాడుతూ.. రెండు రోజులపాటు అవసరమైన అన్ని ప్రాంతాల్లో తాగునీటిని ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్, గణేశ్ ఉత్సవ సమితి సభ్యులు, అదనపు కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, ఇంజినీరింగ్ విభాగం, తదితరులు పాల్గొన్నారు.

## తెరాస సర్కారువి గిరిజన వ్యతిరేక విధానాలు

మళ్లించడంతో పాటు గిరిజన బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీచేయకపోవడమే అందుకు నిదర్శనమన్నారు. భాజపా గిరిజనమోర్చా నగరశాఖ ఆధ్వర్యంలో నగర పార్టీ కార్యాలయంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించారు. కేకు కోశారు. రామ్‌చందర్‌రావు మాట్లాడుతూ గిరిజన తండాలను గ్రామపంచాయతీలను చేస్తామని ప్రకటించి మూడున్నరేళ్లవుతున్నా ఆచరణకు నోచుకోవడంలేదన్నారు. కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి గిరిజన వర్సిటీని మంజూరుచేస్తే ముఖ్యమంత్రి స్థలం కేటాయించలేని దుస్థితి నెలకొందన్నారు. భాజపా గిరిజనమోర్చా జాతీయ కార్యదర్శి అమర్‌సింగ్, నగరపార్టీ ప్రధాన కార్యదర్శులు టి.రాజశేఖర్‌రెడ్డి, గౌతంరావు, గిరిజనమోర్చా నగరాధ్యక్షుడు చరణ్‌సింగ్ పాల్గొన్నారు.

## నంద్యాల ఎన్నికల్లో మాటల తూటాలు

కుట్టుమిషన్లు గుర్తొస్తాయి. రైతులను మోసం చేయడానికి ట్రాక్టర్లు గుర్తుకొస్తాయి. చంద్రబాబుకు ఇంతింత డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది. మన దగ్గర నుంచి దోచిన సొమ్మే మనకు కొద్దో-గొప్పో ఇచ్చే కార్యక్రమం చేస్తున్నారు. మద్యం నుంచి ఇసుక వరకు దోపిడే, గుడి భూముల నుంచి రాజధాని భూముల వరకే దోపిడే' అని అని అన్నారు. చంద్రబాబు తన మూడున్నరేళ్ల పాలనలో మూడున్నరలక్షల కోట్ల రూపాయలు వెనకేసుకున్నారని ఆరోపించారు. ఆరు కోట్లమంది రాష్ట్ర జనాభాలో మూడున్నర లక్షల కోట్ల రూపాయాలు చంద్రబాబు దోచుకున్నారని, సగటున ఒకరి నుంచి రూ. 60వేల చొప్పున చంద్రబాబు దోపిడీ సాగిందని ధ్వజమెత్తారు. దోచుకున్న సొమ్ము నుంచి ఓటర్లకు ఐదువేల చొప్పున చంద్రబాబు పంచబోతున్నారని అన్నారు. 'రానున్న రోజుల్లో చంద్రబాబునాయుడు మూటలు మూటలు డబ్బులతో వచ్చి.. డబ్బులు చేతులో పెట్టి.. తన జేబులో నుంచి దేవుడి పటం తీసి.. తనకే ఓటు వేయాలంటూ మీ అందరితో ప్రమాణం చేయించుకుంటారు. ఏ దేవుడు కూడా పాపం చేయమని చెప్పడు. పాపం చేయమని సైతాన్, దెయ్యమే చెప్తుంది. ఆ దెయ్యాలు మీ దగ్గరకు వచ్చి.. చేతుల్లో డబ్బులు పెట్టి.. ప్రమాణం చేయమన్నప్పుడు ఆ దెయ్యాలతో గొడవ పడకండి. ధర్మం వైపు మేమంతా నిలబడతామని మనస్సులో దేవుడిని తలుచుకొని.. లౌక్యంగా వాళ్లు చేసే దుర్బుద్ధిని, దుర్నీతిని తిప్పికొట్టండి' అని వైఎస్ జగన్ ఓటర్లకు సూచించారు. కచ్చితంగా న్యాయానికి, ధర్మానికే ఓటు వేయాలని నంద్యాల ప్రజలను ఆయన కోరారు. చంద్రబాబు మూడున్నరేళ్ల పాలన మీద ఈ ఎన్నికలు జరుగుతున్నాయని, చంద్రబాబు తన పాలనలో ఏ ఒక్క హామీని కూడా నిలబెట్టుకున్నారా అని నిలదీస్తూ ఓటువేద్దామని ఆయన సూచించారు. చంద్రబాబు ప్రతి ఒక్కరికీ వెన్నుపోటు పొడిచారని మండిపడ్డారు. రైతుల రుణాలు మాఫీ కావాలంటే, బ్యాంకుల్లోని బంగారం ఇంటికి రావాలంటే.. బాబు ముఖ్యమంత్రి కావాలన్నాడు. జాబు కావాలంటే బాబు రావాలన్నాడు. జాబ్ ఇవ్వకపోతే ఇంటింటికి రూ. రెండువేలుచొప్పున నిరుద్యోగ భృతి ఇస్తానన్నాడు. డ్వాక్రా మహిళల రుణాలు మాఫీ చేస్తానన్నాడు. కానీ ఏ ఒక్క హామీని కూడా చంద్రబాబు నెరవేర్చలేదు' అని వైఎస్ జగన్ మండిపడ్డారు. కర్నూలు జిల్లాకు సైతం అది చేస్తాం ఇది చేస్తాం అని చంద్రబాబు మభ్యపెట్టారని విమర్శించారు.

ప్రతి ఓటు అధర్మానికి వ్యతిరేకంగా పడాలి!

'ఇప్పటివరకూ ఏమి చేయని బాబు.. ఉప ఎన్నికకు వచ్చే సరికి ఏవేవో చేస్తానంటున్నాడు. మళ్లీ మోసగిస్తాడు. ఈ పరిస్థితి మార్చాలి. నంద్యాలలో వేసే ప్రతి ఓటు కూడా ఆయన చేసిన అధర్మానికి వ్యతిరేకంగా వేయాలి. ఈ ఎన్నికల్లో మీ అందిరితో చెప్తున్నాను. శిల్పాను అభ్యర్థిగా నిలబెడుతున్నాను. ప్రతి ఓటూ జగన్‌కు వేస్తున్నామనే విషయాన్ని మనసులో పెట్టుకోండి. ఏడాదిన్నరలో జరగబోయే మహాసంగ్రామానికి ఈ ఉప ఎన్నిక నాంది పలకబోతుంది. ప్రతి ఒక్కరూ చిక్కటి చిరునవ్వుతో ఆప్యాయత చూపుతున్నారు. ఆప్యాయత అనురాగానికి ప్రతి అక్కకు, చెల్లికి, అవ్వకు, తాతకు, హృదయపూర్వకంగా కృతజ్ఞతలు. సెలవు. ఇంకొక చిన్న విన్నపం. మన పార్టీ గుర్తు తెలియని వారు ఎవరైనా ఉంటే.. తెలిసిన వారందరూ చెప్పాలి. ఒకసారి గుర్తు చూపిస్తున్నాను అందరూ మన గుర్తు ఫ్యాన్ అని గుర్తుంచుకోవాలి' అని వైఎస్ జగన్ అన్నారు.

## డ్రగ్ రాకెట్ సూత్రధారి గాబ్రియేల్ అరెస్టు

బిజినెస్ వీసాపై గాబ్రియేల్ నగరానికి వచ్చి వెళ్తున్నాడని, గోవా నుంచి మాదకద్రవ్యాల్ని నగరానికి దిగుమతి చేయడంలో అతనిదే ముఖ్య భూమికని పోలీసులు అనుమానిస్తున్నారు. కొకైన్, బ్రౌన్‌షుగర్, ఎంపిటమైన్ తదితర మాదకద్రవ్యాల విక్రయ ముఠాలతో గాబ్రియేల్‌కు సత్సంబంధాలున్నాయని ఇప్పటికే పోలీసులు గుర్తించారు.

కాగా, గత నెలాఖరులో ఎల్‌బీనగర్ ఠాణా పరిధిలో నైజీరియన్ ఒజుకు కాస్మోస్, అతని ప్రియురాలు విజయవాడకు చెందిన పాలపర్తి సంగీత ముఠాను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వారు డ్రగ్స్ విక్రయిస్తూ పోలీసులకు చిక్కడంతో గాబ్రియేల్ వ్యవహారం తెరపైకి వచ్చింది. ఈ గ్యాంగ్ విక్రయిస్తున్న డ్రగ్స్‌ను గాబ్రియేల్ సరఫరా చేస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో వారు వాంగ్మూలం ఇచ్చారు. దీంతో గాబ్రియేల్ గురించి పోలీసులు ఆరా తీశారు. గతంలో 20 గ్రాముల కొకైన్ విక్రయించేందుకు ప్రయత్నించిన గాబ్రియేల్‌ను ఈస్ట్‌మారేడ్‌పల్లి పోలీసులు అతన్ని అరెస్ట్ చేశారు. ఆ కేసులో బెయిల్‌పై బయటికి వచ్చిన గాబ్రియేల్.. ఆ తర్వాత కూడా దందా సాగించినట్లు తేలింది. ఈనేపథ్యంలో గాబ్రియేల్ కదలికపై నిఘా ఉంచిన పోలీసులు ఢిల్లీ నుంచి అతను వచ్చాడనే పక్కా సమాచారంతో దాడిచేసి పట్టుకున్నారు.

## గ్రామాన్ని ఖాళీ చేయిస్తున్న భారత సైన్యం

వాసులను తక్షణమే ఖాళీ చేయాలని ఇండియన్ ఆర్మీ ఆదేశించినట్లు తెలుస్తోంది. ఈ గ్రామంలో సుమారు 200 మంది నివసిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం భారత్-చైనా మధ్య ప్రతిష్టంభనకు కారణమైన డోకలామ్‌కు 35 కి.మీ. దూరంలో ఈ గ్రామం ఉంది.

సుక్నా నుంచి డోకలామ్ వైపు భారతదేశానికి చెందిన 33 కార్ప్ దళాలు వెళ్తున్నాయి. వీరిని ఈ గ్రామంలో ఉంచుతారా? అనే విషయంపై స్పష్టత కనిపించడం లేదు. చైనా దళాలు ఏ క్షణంలోనైనా దూకుడు ప్రదర్శిస్తే, ప్రజలను కాపడే ఉద్దేశంతో ఈ దళాలను పంపిస్తున్నారా? అనే అంశంపై కూడా సమాచారం తెలియడం లేదు.

నాథంగ్ గ్రామస్థులు మాట్లాడుతూ ఇటీవల భారతీయ దళాలు భారీగా తమ గ్రామం వైపు వస్తున్నట్లు తెలిపారు.

దీనిపై సైనికాధికారులు మాట్లాడుతూ ఏటా జరిగే సాధారణ విన్యాసాల్లో భాగంగానే దళాలు వెళ్తున్నాయని చెప్పారు. అయితే ప్రతి సంవత్సరం సెప్టెంబరులో జరిగే విన్యాసాలను ఈసారి ఆగస్టులోనే నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# 12 కిలోల గంజాయి పట్టివేత.. ఇద్దరి అరెస్టు



మంచిర్యాల : విజయవాడ నుంచి అక్రమంగా రైల్లో గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని మంచిర్యాల జీఆర్పీ పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మంచిర్యాల రైల్వేస్టేషన్ లోని రైల్వేప్రభుత్వ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో జీఆర్పీ ఎస్సై జితేందర్‌రెడ్డి వెల్లడించారు. మహారాష్ట్రలోని యవత్‌మాల్ ప్రాంతానికి చెందిన షేక్ షాకిర్, ఎండీ సునిల్ ఇంగ్డె అనే యువకులు విజయవాడలో 12 కిలోల గంజాయిని కొనుగోలు చేసి ఆనంద్‌వన్ ఎక్స్‌ప్రెస్ రైలులో తమ వూరికి బయలుదేరారు. మంగళవారం రాత్రి మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో ఆగిన రైలులో ఉన్న షేక్ షాకిర్, ఎండీ సునిల్ ఇంగ్డెలు అనుమానాస్పదంగా కనిపించడంతో జీఆర్పీ పోలీసులు వారి వద్దగల బ్యాగులను తనిఖీ చేయగా గంజాయి పొట్లాలు బయటపడ్డాయి. ఈ మేరకు వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి కాజీపేట జీఆర్పీ సీఐ ఎస్. వెంకటేశ్ సమక్షంలో రిమాండ్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ ఎం. జగన్, సిబ్బంది అశోక్, శ్రీహరి, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

## ఆటోను ఢీ కొట్టిన బస్సు ..పలువురికి గాయాలు

ఉట్నూరు : ఉట్నూరు మండలంలోని శ్యాంపూర్ సమీపాన బుధవారం బస్సు ఆటోను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంద్రవెల్లి నుంచి తాండ్రా వెళ్తున్న ఆటోను వెనుక వైపు నుంచి వరంగల్‌కు వెళ్తున్న బస్సు ఢీ కొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న 8 మందిలో ఐదుగురికి గాయాలయ్యాయని వారు పేర్కొన్నారు. బస్సు వేగంగా వచ్చిందని, బస్సు డ్రైవర్ అజాగ్రత్త వల్లనే ఈ ప్రమాదం చోటు చేసుకుందని వారు తెలిపారు. స్థానికులు వెంటనే గాయపడిన క్షతగాత్రులు నూరుబాయి, గిరిజాబాయి, ఓల్వాడికి చెందిన చిత్రు, నీల, ఆదిలాబాద్‌కు చెందిన ఆనందర్‌రావ్‌లను ఉట్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఆసుపత్రిలో వైద్యులు వారికి చికిత్స పొందుతున్నారు.

# హైదరాబాద్ ప్రాంతీయ వార్తలు

## ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

### జిల్లా పాలనాధికారి బుద్ధ ప్రకాశ్ ఎం.జ్యోతి

జైనథ్ : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాల పనులు వేగవంతం చేయాలని జిల్లా పాలనాధికారి బుద్ధ ప్రకాశ్ ఎం.జ్యోతి అధికారులను ఆదేశించారు. జైనథ్ మండలంలో పాలనాధికారి విస్తృతంగా పర్యటించారు. మండల కేంద్రంలో నిర్మాణం చేపడుతున్న రెండు పడక గదుల ఇళ్లను పరిశీలించారు. నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పంచాయతీ రాజ్ అధికారులతో మాట్లాడారు. సర్వే నెంబరు, భూమి వివరాలు తహసీల్దార్ ప్రభాకర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. 131 ఇళ్లలో 41 పనులు ప్రారంభమయ్యాయని పాలనాధికారికి వివరించారు మిగతావి ఎందుకు ప్రారంభించలేదని తొందరగా నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. డిసెంబర్ వరకు 41 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. గుత్తేదారుతో మాట్లాడారు. నాణ్యత విషయంలో రాజీ పడవద్దని సూచించారు. సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని చెప్పారు. పంచాయతీరాజ్ శాఖ ఇటీవల రూ.5 కోట్లతో నిర్మాణం చేపట్టిన కరంజి, మాకోడ, బెల్లూరి, దీపాయిగూడ రహదారులను పరిశీలించారు. పాలనాధికారి మంత్రి సొంత గ్రామం దీపాయిగూడకు చేరుకొని రూ.2.50 కోట్లతో నిర్మిస్తున్న చెక్‌డ్యాం, వంతెనను పరిశీలించారు. సమస్యలేమైనా ఉన్నాయా అని సర్పంచిని, గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. పాలనాధికారి వెంట ఎస్‌ఈ ఐ.రమేష్, ఈఈ మారుతి, డీఈలు రవిప్రకాష్, రఫత్, ఏఈ నిఖిలేశ్వర్ ఉన్నారు.

## బ్యాంకును రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపాం

ఖమ్మం : గత నాలుగున్నరేళ్లుగా అహర్నిశలు కష్టపడి బ్యాంకును రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపినట్లు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మన్ మువ్వా విజయబాబు చెప్పారు. ఖమ్మం గాంధీ చౌక్‌లోని ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము బాధ్యతలు స్వీకరించే నాటికి బ్యాంకు లావాదేవీలు రూ.800కోట్లు ఉండగా ప్రస్తుతం రూ.2000కోట్లకు చేరి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. గత నాలుగున్నరేళ్ల నుంచి కూడా బ్యాంకు లాభాల్లోనే నడుస్తోందన్నారు. ఈసంవత్సరం రూ.1.05కోట్ల లాభం ఆర్జించిందన్నారు. సహకార రైతులను ఆదుకోవటం కోసం ప్రత్యేకంగా రైతు సంక్షేమనిధిని కూడా ఏర్పాటు చేశామన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో బ్యాంకును అభివృద్ధి పథంలో నడపటానికి పాలకవర్గం అనేక చర్యలు తీసుకుందని చెప్పారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతిలో వ్యవసాయం చేయటం కోసం ప్రత్యేకంగా భూసార పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతులకు భూసార ఆరోగ్య కార్డులు అందజేస్తున్నామని విజయబాబు అన్నారు. అతి తక్కువ ఖర్చులతో రైతులకు వైద్యం అందించటం కోసం ఖమ్మం నగరంలో ప్రత్యేకంగా ఆసుపత్రిని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రైతులకు రూ.100కోట్ల ఓవర్ డ్రాఫ్ట్ రుణాలు అందించటం రాష్ట్రంలో ప్రథమం అన్నారు. వాణిజ్య బ్యాంకులకు దీటుగా సహకార బ్యాంకులను కూడా ఆధునికీకరించామన్నారు. గత 90ఏళ్ల బ్యాంకు చరిత్రలో మొత్తం 30డీసీసీబీ శాఖలు ఉంటే ప్రస్తుతం వాటి సంఖ్యను కేవలం నాలుగేళ్లలో 50కి పెంచామని, మరో 14శాఖలకు కూడా ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత రైతులకు సహకార సేవలు మరింత విస్తృతం చేయటమే లక్ష్యంగా కొత్తశాఖలను ఏర్పాటు చేయాలని పాలకవర్గం నిర్ణయించినట్లు విజయబాబు చెప్పారు. బ్యాంక్ నిరర్ధక ఆస్తులు కూడా కేవలం 3శాతం మాత్రమే ఉన్నాయన్నారు. ఏపీ నుంచి రావాల్సిన రుణాలు వస్తే ఇది 1.50 శాతానికి తగ్గుతుందని అన్నారు. విలేకరుల సమావేశంలో డీసీసీబీ ఉపాధ్యక్షుడు బాగం హేమంతరావు, పాలకవర్గ సభ్యుడు మండే వీర హనుమంతరావు, బద్దూలాల్, సంఘాల అధ్యక్షులు సామినేని వెంకటేశ్వరరావు, బోయినపల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పక్కదారి పట్టిస్తున్న రేషన్ కిరోసిన్ పట్టివేత

ఇల్లెందు : ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు పంపిణీ చేయాల్సిన కిరోసిన్‌ను పక్కదారి పట్టిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. పట్టణంలోని నెం.2 బస్తీకి చెందిన ఎండీ సలీం ఇంట్లో అక్రమంగా నిల్వ ఉన్న కిరోసిన్‌ను ఎస్సై కొమురెల్లి ఆధ్వర్యంలో సిబ్బంది పట్టుకున్నారు. ప్రజాపంపిణీ ద్వారా పేదలకు పంపిణీ చేయాల్సిన కిరోసిన్‌ను నల్లబజారులో విక్రయిస్తున్న సలీంను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. కిరోసిన్‌ను పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్‌కు అప్పగించారు. తదుపరి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు అందించాల్సిన కిరోసిన్‌ను కొందరు వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారన్నారు. సమాచారం మేరకు నెం.2బస్తీలో సలీం ఇంట్లో తనిఖీలు నిర్వహించి పట్టుకున్నామని తెలిపారు. ప్రజా పంపిణీ బియ్యం, కిరోసిన్ నల్లబజారులో విక్రయాలపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. వెంకటకృష్ణ, సుమన్ పాల్గొన్నారు.

## హామీల అమలులో విఫలం



ఆదిలాబాద్ : ఆనాడు దేశం నుంచి బ్రిటీష్ పాలకులను వెళ్లగొట్టినట్లే.. ప్రస్తుతం భాజపా, తెరాస అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను పారద్రోలాల్సిన అవసరముందని మాజీ మంత్రి రాంచంద్రారెడ్డి పేర్కొన్నారు. క్విట్ ఇండియా దినోత్సవాన్ని పురస్కరించుకొని తన నివాసంలో పార్టీ నాయకులతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. ఆయన మాట్లాడుతూ భాజపా, తెరాస ప్రభుత్వాలు కేవలం మాటలకే పరిమితమయ్యాయని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యాయని విమర్శించారు. తెరాస అనేక వాగ్దానాలు చేసినా.. వాటిని అమలు చేయడం లేదని తెలిపారు. పట్టణంలోని 170 సర్వేనెంబర్‌లో పేదలకు ఇచ్చిన ప్రభుత్వ స్థలాల్లో వారిని బలవంతంగా అక్కడ్నుంచి వెళ్లగొట్టి ఇతరులకు రెండు పడకగదుల ఇళ్ల నిర్మాణం చేపట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అక్కడ ఇళ్లు కట్టించాలని అనుకుంటే వారికే నిర్మించి ఇవ్వచ్చుకదా అని ప్రశ్నించారు. వారి పార్టీ కార్యకర్తలకు ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారని వివరించారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరిని కాంగ్రెస్ కార్యకర్తలు ఐక్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నేతలు సంజీవరెడ్డి, విఠల్, సయిద్‌ఖాన్, అంబకంటి అశోక్, కందుల, అశోక్‌గౌడ్, జఫీఉల్లాఖాన్, మావల మండల అధ్యక్షుడు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలను పెంచాలి

మహబూబ్‌నగర్ : విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలను పెంచాలని జిల్లా విద్యాశాఖ అధికారి సోమిరెడ్డి ఆదేశించారు. సర్వశిక్ష అభియాన్ సమావేశ మందిరంలో నిర్వహించిన గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోల సమావేశంలో ఆయన మాట్లాడారు. చాలా పాఠశాలల్లో విద్యార్థులకు కనీస సామర్థ్యాలు ఉండడం లేదని అన్నారు. కనీసం చదవడం, రాయడం వంటివి కూడా చేయడం లేదని చెప్పారు. ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకున్న పాఠశాలల్లో విద్యార్థులకు మంచి విద్య, వారిలో సామర్థ్యాల స్థాయి ఎక్కువగా ఉందని అన్నారు. ఇలాంటి పాఠశాలలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సమావేశాలకే ఆలస్యంగా వస్తున్నారని, మరి పాఠశాలలకు ఏ విధంగా వెళ్తారని ప్రశ్నించారు. పనితీరుపై ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. అభ్యసనాభివృద్ధి కార్యక్రమంలో ఎంఈవోలు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలే కీలకమన్నారు. పాఠశాలల్లో తరగతులు సక్రమంగా నిర్వహించాలన్నారు. సరిగా నిర్వహించకపోతే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఏఎంవో హేమచంద్రుడు, నోడల్ అధికారి వర్రపసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

## హరితహారంలో 55 లక్షల మొక్కలు



కొడిపల్లి: జిల్లాలో హరితహారం కింద ఇప్పటివరకు 55 లక్షల మొక్కలు నాటినట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సీతారామారావు తెలిపారు. కొడిపల్లి మండలం తునికి గ్రామ శివారులోని వెంకటేశ్వర హ్యాచరీలో బుధవారం హరితహారం కింద మొక్కలు నాటారు. జిల్లా పంచాయతీ అధికారి హనోక్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ రత్నాకర్, నర్సాపూర్ ఆర్డీవో వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో మూడో విడత కింద 1.48 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యం ఉండగా ఇప్పటవరకు 55 లక్షలు నాటినట్లు తెలిపారు. లక్ష్యం మేరకు జిల్లాలో మొక్కలను నాటడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. మానవ మనుగడకు మొక్కలే కీలకమనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని కోరారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ రత్నాకర్ మాట్లాడుతూ హరితహారం కింద పరిశ్రమల్లో 3 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంకాగా ఇప్పటి వరకు రెండు లక్షలు నాటినట్లు పేర్కొన్నారు. పరిశ్రమల్లో మూడోవంతు కచ్చితంగా మొక్కలు నాటాల్సి ఉందన్నారు. జిల్లా పంచాయతీ అధికారి హనోక్ మాట్లాడులూ మొక్కల సంరక్షణ విషయంలో ప్రజల్లో బాగా చైతన్యం రావాలని సూచించారు. ఈ సందర్భంగా వెయ్యి మొక్కలు నాటి నీరుపోశారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీడీ వసంతసుగుణ, ఎంపీడీఓ సత్యనారాయణ, తహసీల్దార్ శ్రీశైలం, ఏపీఓ అంజిరెడ్డి, హ్యాచరీ జనరల్ మేనేజర్ ప్రసాద్, ఉపసర్పంచి శేఖర్, తెరాస ముఖ్య నాయకులు మోషయ్య తదితరులు పాల్గొన్నారు.

## మెనూ ప్రకారం భోజనం అందించాలి

నల్గొండ : విద్యార్థుల భవిష్యత్, తెలంగాణ రాష్ట్ర భవిష్యత్ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, వసతిగృహ సంక్షేమాధికారుల చేతుల్లో ఉందని కలెక్టర్ డా.గౌరవ్‌ఉప్పల్ అన్నారు. కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో ఎంఈవోలు, జడ్పీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గురుకుల, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, వసతిగృహ సంక్షేమాధి అధికారులు, సహాయ సాంఘిక సంక్షేమాధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. డీఈవో డా.ఏలే చంద్రమోహన్ మాట్లాడుతూ వివరాలను సకాలంలో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ నెల 11న అన్ని పాఠశాలల్లో మిజిల్, రూబెల్లా వాక్సిన్ వేసేందుకు అవగాహన సమావేశాలు ఏర్పాటు చేయాలని డీఎంహెచ్‌వో సూచించారు.

## ఫ్లోరైడ్ తక్కువ ఉన్న నీటిని అందించాలి: కలెక్టర్



నల్గొండ : ఫ్లోరైడ్ ప్రాంతమైన మర్రిగూడ మండలంలో ఆర్‌వో నీళ్లు, బోరు నీళ్లు, కృష్ణా నీటిని పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించి ఏ నీటిలో ఎంత ఫ్లోరైడ్ శాతం ఉందో తెలుసుకోవాలని కలెక్టర్ డా.గౌరవ్‌ఉప్పల్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లాఫ్లోరైడ్ మానిటరింగ్ కమిటీ అధికారులతో సమావేశమయ్యారు. మర్రిగూడ మండలంలో ఏ నీటిలో ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉందో ఆనీటిని సరఫరా చేయడం నిలిపివేసి ఫ్లోరైడ్ తక్కువ ఉన్న నీటిని సరఫరా చేయాలన్నారు. మండలంలో ప్రజలు తినే ఆహారం ధాన్యాలు, కాయగూరలను ఎన్ఐఎన్ హైదరాబాద్‌కు పంపించి ఫ్లోరైడ్ శాతం గురించి తెలుసుకోవాలని సూచించారు. వివిధ శాఖలు సమన్వయంతో పనిచేసి ఫ్లోరైడ్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పాపారావు, జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహరావు, పశుసంవర్ధకశాఖ జేడీ సీహెచ్ రమేష్, డీపీవో గోపాల్, డీఈవో చంద్రమోహన్, స్త్రీ శిశు సంక్షేమ వికలాంగులు వయోవృద్ధులశాఖ అధికారి పుష్పలత, ఎన్‌పీపీసీఎఫ్ నుంచి డా.క్రాంతి, డీఎఫ్ఎంసీ బృందం స్ఫూర్తి, సౌజన్య, ప్రసాద్ పాల్గొన్నారు.

## సహకార రైతులకు రూ.100 కోట్ల కొత్త రుణాలు

### మహాజన సభలో డీసీసీబీ అధ్యక్షుడు మువ్వా విజయబాబు

ఖమ్మం : ఈ సంవత్సరం సహకార రైతులకు రూ.100 కోట్ల కొత్తరుణాలు మంజూరు చేయనున్నట్లు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మన్ మువ్వా విజయబాబు తెలిపారు. ఖమ్మం గాంధీచౌక్‌లోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో జరిగిన 112వ మహాజన సభలో ఆయన మాట్లాడారు.

వచ్చే సెప్టెంబరు నుంచే అర్హులైన రైతులకు వీటిని పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. తాము పదవీ బాధ్యతలు స్వీకరించి నాలుగున్నరేళ్లు పూర్తయ్యిం దని, ఈకాలంలో రైతుల ప్రయోజనం కోసం పాలకవర్గం అనేక పథకాలను అమలు చేసిందన్నారు. తాము బాధ్యతలు స్వీకరించే నాటికి వాటా ధనం రూ.49 కోట్లు ఉండగా ఇప్పుడు అది రూ.85 కోట్లకు పెరిగిందన్నారు. పంట రుణాలు రూ.380 కోట్ల నుంచి రూ.680 కోట్ల వరకు పెంచి ఇచ్చినట్లు చెప్పారు. అవిభాజ్య ఖమ్మం జిల్లాలో మొత్తం రూ.480కోట్ల రుణమాఫీ చేయించటం జరిగిందన్నారు. పేద రైతులకు స్వయం సహాయక సంఘాలకు, పాడిగేదెలకు, ద్విచక్రవాహనాలకు కూడా రుణ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. రుణాల రికవరీ 90నుంచి 96శాతానికి పెరిగిందని విజయబాబు అన్నారు. పొదుపు చేసిన జేఎల్‌జీ గ్రూపులకు రూ.1.50లక్షల వరకు రుణం అందజేస్తామన్నారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా పాలకవర్గం పనిచేసిందన్నారు. జిల్లాలో టీఎస్ సీడ్స్ ద్వారా సరఫరా చేసిన విత్తనాలు మొలకెత్తక పోవటం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయినట్లు పలువురు సహకార సంఘాల అధ్యక్షులు సమావేశంలో ధ్వజమెత్తారు. ప్రభుత్వం ద్వారా సరఫరా చేసిన విత్తనాలకే దిక్కు లేకుంటే ఇక ప్రైవేటు విత్తన కంపెనీల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాలన్నారు. విత్తనాలు వేసి నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సహకార సంఘాలపై ప్రభుత్వం విధించిన జీఎస్టీని ఎత్తివేయాలని కోరారు. అదే విధంగా సీఎం కేసీఆర్ త్వరలో ఏర్పాటు చేయనున్న గ్రామ రైతు సంఘాల కన్వీనర్‌లకు సహకార సంఘాల అధ్యక్షులను నామినేట్ చేయాలని కూడా విజ్ఞప్తి చేశారు. మహాజన సభలో డీసీసీబీ ఉపాధ్యక్షుడు బాగం హేమంతరావు, జిల్లా సహకార అధికారి శీలం అప్పిరెడ్డి, డీసీసీబీ సీఈఓ వి.నాగచెన్నారావు, పాలకవర్గ సభ్యులు రాయల వెంకటశేషగిరి రావు, మండే వీరహనుమంతరావు, పోలుదాసు కృష్ణమూర్తి, నాబార్డు ఏజీఎం వెంకటేశ్వరరావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీసీఓ మైఖేల్‌బోస్, టీఎస్ సీడ్స్ మేనేజర్ కోటిలింగం, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ మహేశ్, ఏడీఏ శ్రీనివాసరెడ్డి, సహకార సంఘాల అధ్యక్షులు ఉమ్మనేని కోటయ్య, సామినేని వెంకటయ్య, ఐలూరి వెంకటేశ్వరరెడ్డి, స్వర్ణ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సామూహిక జాతీయ గీతాలాపన

ఆదిలాబాద్ : పుడమి తల్లి పులకించింది. జాతీయ జెండా రెపరెపలాడింది. పదివేల మందికి పైగా సామూహిక జనగణమన గీతాలాపనలో పాల్గొన్నారు. దేశభక్తి గీతాలపై చిన్నారుల సాంస్కృతిక నృత్యాలు అంబరాన్నంటాయి. అందుకు వేదికగా నిలిచింది ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానం.. క్విట్ ఇండియా ఉద్యమానికి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంలో వర్తక, వాణిజ్య, వ్యాపారుల సంఘం(సీఓసీ) ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన దేశభక్తి కార్యక్రమానికి జనాల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి జోగురామన్న హాజరయ్యారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న వీరులకు ఘనంగా నివాళులర్పించారు. మంత్రి రామన్న మాట్లాడుతూ దేశభక్తి, ఐక్యతకు చిహ్నంగా, భిన్నత్వంలో ఏకత్వంగా, ప్రపంచంలోనే అన్ని సంస్కృతి, సంప్రదాయాలకు నిలయంగా భారత దేశమని పేర్కొన్నారు. దేశాన్ని ముందు నడిపించే బాధ్యత విద్యార్థులదేనని, విద్యతోనే సంస్కారం, సమాజంలో గౌరవం, ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని, అందుకు ప్రతి విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించాలని ఆకాంక్షించారు. పుర అధ్యక్షురాలు రంగినేని మనీష మాట్లాడుతూ నేడు మత్తు మందులకు బానిసలవుతున్న యువత చెడు మార్గం వైపు వెళుతున్నారని, మత్తు జీవితాన్ని చిత్తు చేస్తుందన్నారు. తల్లిదండ్రులు, పోషకులు తమ పిల్లలకు మంచి క్రమశిక్షణ, దేశభక్తి అంశాలవైపు నడిపించాలని కోరారు. భాజపా జిల్లా అధ్యక్షుడు పాయల శంకర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరిలో దేశభక్తిని పెంపొందించేలా ఏర్పాటు చేసిన కార్యక్రమం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని దేశభక్తి, సామాజిక కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమ నిర్వాహకుడు, సీఓసీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్ అగ్రవాల్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే మొట్ట మొదటి కార్యక్రమం నిర్వహించడం గర్వంగా భావిస్తున్నానని, ప్రజల్లో దేశభక్తి దీపాన్ని వెలిగించి జిల్లాను ప్రకాశవంతంగా తీర్చిదిద్దేందుకు భవిష్యత్తులో తమవంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం మంత్రి రామన్న జాతీయ జెండాను ఆవిష్కరించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు, ప్రజలు సామూహిక జనగణమన గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి లింగయ్య, ఉప విద్యాధికారి శ్యాంరావు, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల మహిళా కన్వీనర్ కస్తాల ప్రేమల, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రౌతు మనోహర్, తెరాస నాయకులు యూనిస్ అక్బాని, సాజిదోద్దీన్, వర్తక, వాణిజ్య, వ్యాపారుల సంఘం నాయకులు కందుల రవీందర్, చంద్రశేఖర్ వైద్య, కదం వినాయక్, వెంకట్‌రెడ్డి, ఉదయ్ జైస్వాల్, పురుషోత్తం, ఎం.మహేందర్, సంతోష్, కిరాణ మర్చంట్ సంఘం నాయకులు బండారి వామన్, బాను అగర్వాల్, పలు సంఘాల నేతలు మహ్మద్ బిలాల్, రాంచందర్ మహాత్మ, బషీర్‌భాయ్, అఫ్రోజ్, గంద్రత్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# విజయభాను

## సంపాదకీయం

### విలువలతో కూడిన రాజకీయాలు

రాజకీయాలను భ్రష్టు పట్టించడంలో రెండు పక్షాలూ పోటాపోటీగా సాగుతున్నాయి. రాజకీయ పక్షాలు ప్రజాసేవాకాంక్ష గల ఉత్తమమైన నాయకులకు టికెట్లు ఇచ్చి గెలిపించుకున్నట్టయితే వారు ప్రలోభాలకు గురికారు. క్యాంపు రాజకీయాలు, బహిరంగ ఓటింగ్ విధానాల అవసరం ఉండదు. ఇప్పటికైనా రాజకీయ పక్షాలు విలువలతో కూడిన రాజకీయాలను నెలకొల్పడానికి ప్రయత్నించాలె. గుజరాత్ నుంచి రాజ్యసభ సభ్యులను ఎన్నుకోవడానికి జరిగిన పోలింగ్ సార్వత్రిక ఎన్నికలను తలపించి ఉత్కంఠను రేపింది. బీజేపీ, కాంగ్రెస్ కొద్ది రోజులుగా నడుపుతున్న రాజకీయ నాటకం రసవత్తరంగా మారి అర్ధరాత్రికి పతాకస్థాయికి చేరింది. మొత్తం మూడు స్థానాలలో బీజేపీకి ఇద్దరు అభ్యర్థులను గెలిపించుకునే బలం మాత్రమే ఉన్నది. లెక్క ప్రకారం మూడో స్థానం కాంగ్రెస్‌కు దక్కుతుంది. కానీ బీజేపీ మూడో అభ్యర్థిని కూడా పోటీ పెట్టి కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ప్రలోభ పెట్టి గెలువాలనుకున్నది. కాంగ్రెస్ నుంచి కొంత మందిని తమవైపు తిప్పుకోగలిగింది. కాంగ్రెస్‌లోని బలమైన నాయకుడు వాఘేలా కొత్త పార్టీ ఏర్పాటు చేసి, బీజేపీకి మద్దతు పలికారు. కాంగ్రెస్ చీఫ్ విప్‌గా పనిచేసిన మాజీ ఎమ్మెల్యే బల్వంత్‌సింహ్ రాజ్‌పుత్‌ను మూడో అభ్యర్థిగా నిలబెట్టి కాంగ్రెస్ ప్రముఖుడు, సోనియా గాంధీ రాజకీయ సలహాదారు అహ్మద్ పటేల్ విజయావకాశాలను దెబ్బకొట్టాలని భావించింది. వచ్చే ఏడాది గుజరాత్ అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో, కాంగ్రెస్ పార్టీ శ్రేణుల నైతికస్థైర్యాన్ని దెబ్బతీయాలనే ది బీజేపీ నేత అమిత్ షా ఎత్తుగడ. కానీ రాజ్యసభకు పోటీ చేస్తున్న అహ్మద్ పటేల్ కూడా అమిత్‌షా మాదిరిగా అపర చాణక్యుడే. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ప్రత్యేక శిబిరానికి తరలించి కాపాడుకున్నారు. బీజేపీకి ఓటేసి బ్యాలట్ పత్రాన్ని అమిత్‌షాకు చూపించిన తమ ఇద్దరు ఎమ్మెల్యేల ఓట్లను చెల్లకుండా చేయించడంలో కూడా కాంగ్రెస్ నాయకత్వం సఫలమైంది. దీంతో బీజేపీ వ్యూహం బెడిసికొట్టడమే కాదు, ఆ పార్టీ నైతికత ప్రశ్నార్థకమైంది. పార్టీ రాజకీయాలు ఎట్లా ఉన్నా, బ్యాలట్ పత్రాన్ని బహిరంగ పరిచిన కాంగ్రెస్ సభ్యుల ఓట్లు చెల్లవని ప్రకటించిన ఎన్నికల కమిషన్ నిర్ణయం హర్షించదగినది. ప్రజాక్షేత్రంలో విజయం సాధించి చట్టసభల్లో ప్రవేశించడం ప్రజాస్వామ్య లక్షణం. అయితే దేశ ప్రయోజనాల కోసం, శాసన రంగాన్ని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దడానికి మేధావుల సేవలను ఉపయోగించుకోవడం కూడా అవసరమే. రాజ్యసభ ఇందుకు వీలు కల్పిస్తున్నది. కానీ ఇటీవలి కాలంలో పారిశ్రామికవేత్తలు పార్లమెంటులో ప్రవేశించడానికి శాసన సభ్యులను ప్రలోభ పెడుతున్నారనే ఆరోపణలు వచ్చాయి. అందువల్ల రాజ్యసభ ఎన్నికలలో ఓటేసే శాసన సభ్యులు పార్టీ నిర్ణయానికి కట్టుబడేందుకు బహిరంగ బ్యాలెట్ విధానం ప్రవేశపెట్టారు. ఈ విధానం ప్రకారం శాసనసభ్యుడు ఓటేసిన తరువాత బ్యాలెట్ పత్రాన్ని పార్టీ నియమించిన ప్రతినిధికి చూపించవలసి ఉంటుంది. నిజానికి ఇటువంటి నిబంధన ఉండటం బాధాకరమే. శాసనసభ్యుని స్వేచ్ఛకు భంగం కలుగకూడదు. ప్రజాస్వామ్యానికి, ఎన్నికల వ్యవస్థకు ప్రాణప్రదమైన రహస్య బ్యాలెట్ విధానం చెక్కుచెదరకూడదనేది ప్రజాస్వామ్య ప్రియుల ఆకాంక్ష. కానీ ప్రజాస్వామ్యం ధనస్వామ్యంగా మారే ప్రమాదాన్ని అరికట్టడానికి చేసిన మినహాయింపు ఇది. గుజరాత్ రాజ్యసభ ఎన్నికల లో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు పార్టీ ఆదేశాలకు విరుద్ధంగా బీజేపీకి ఓటేయడ మే కాకుండా, బ్యాలెట్‌ను ఆ పార్టీ అధ్యక్షుడు అమిత్‌షాకు చూపించారు. దీనిపై కాంగ్రెస్ అభ్యంతరం చెప్పింది. రాజ్యసభలో బహిరంగ విధానాన్ని అమలు చేస్తున్నందువల్ల బ్యాలెట్‌ను చూపించడంలో తప్పులేదనేది బీజేపీ వాదన. ఈ వివాదాన్ని కూలంకషంగా విచారించిన ఎన్నికల కమిషన్ ఆ ఇద్దరు కాంగ్రెస్ శాసనసభ్యుల ఓట్లు చెల్లవని ప్రకటించింది. కొత్త విధానం ప్రకారం- ఓటరు తన బ్యాలెట్ పత్రాన్ని తమ పార్టీ నియమించిన ప్రతినిధికి చూపించాలే తప్ప ఇతరులకు కాదు. పార్టీ ప్రతినిధికి చూపించే నిబంధన ఉన్నప్పటికీ, ప్రజాస్వామ్యానికి కీలకమైన రహస్య ఓటు విధానం తొలిగిపోయినట్టు కాదు. ఓటు గోప్యతను, పవిత్రను కాపాడే రీతిలో ఎన్నికల కమిషన్ ఇచ్చిన స్పష్టత ప్రజాస్వామ్యవాదులకు సంతృప్తినిచ్చేదిగా ఉన్నది. ప్రజా ప్రతినిధులు ప్రలోభాలకు గురవుతున్న నేపథ్యంలో, పార్టీ నాయకత్వానికి జవాబుదారీగా ఉండటానికి మాత్రమే రహస్య బ్యాలెట్ విధానంలో ఒక మినహాయింపును చేర్చారు. అయినంత మాత్రాన అంత బహిరంగంగా బ్యాలెట్ పత్రాన్ని ప్రదర్శించడం నిబంధనలకు విరుద్ధమే.

# నితీశ్ వెలివేతకు రంగం సిద్ధం?



పట్నా: బీజేపీ- జేడీ(యూ) మళ్లీ చేతులు కలుపడంతో బిహార్ రాజకీయాలు రోజుకో మలుపు తిరుగుతున్నాయి. మహాకూటమిని వీడి.. మళ్లీ బీజేపీతో జత కట్టిన జేడీయూ అధ్యక్షుడు నితీశ్‌కుమార్ పై ఆ పార్టీ మాజీ అధ్యక్షుడు, సీనియర్ నేత శరద్ యాదవ్‌తోపాటు పలువురు నేతలు గుర్రుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో పార్టీలోని అసమ్మతి వర్గం నితీశ్‌కు వ్యతిరేకంగా ఓ కీలక నిర్ణయం తీసుకోబోతుందన్న సంకేతాలు అందుతున్నాయి. ఆయనను పార్టీ నుంచి బహిష్కరించాలని జేడీయూ అసమ్మతి వర్గం భావిస్తోంది. మహాఘట్ బంధన్(కూటమి) నుంచి బయటకు వచ్చేయటం 2015 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజాతీర్పును అవమానించటమే, అందుకే నితీశ్‌ను అధ్యక్ష పదవి నుంచి తొలగించే అంశంపై న్యాయ నిపుణులతో చర్చిస్తున్నామని పార్టీ మాజీ జనరల్ సెక్రటరీ అరుణ్ శ్రీవాస్తవ తెలిపారు.

గుజరాత్ రాజ్యసభ ఎన్నికల సందర్భంగా పార్టీ వ్యతిరేక చర్యకు పాల్పడ్డారంటూ అరుణ్‌పై నితీశ్ వేటు వేసిన విషయం తెలిసిందే. ఇదిలా ఉంటే పార్టీపై పట్టుకోసం నితీశ్ ఈ నెల 19న పట్నాలో జాతీయ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. అదే సమయంలో సీనియర్ నేత శరద్‌యాదవ్ కూడా రాష్ట్రం మొత్తం పర్యటించి పార్టీ నేతలతో భేటీకానున్నారు. ఒకవేళ ఈ రెండు వర్గాలు గనుక విడిపోయేందుకే మొగ్గు చూపినట్లయితే సమాజ్‌వాదీ లుకలుకలు, అన్నాడీఎంకేలో వర్గపోరు తరహాలోనే జేడీ(యూ) పంచాయితీ కూడా ఎన్నికల సంఘం ముందుకు చేరే అవకాశం ఉంటుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# స్కూల్‌లో బార్‌గర్ల్స్ తో చిందులు



వారాణాసి: పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసే పాఠశాలలో పాడు పని చేశాడు ఓ గ్రామ పెద్ద. సాక్షాత్తు తరగతి గదిలోనే తప్పతాగి బార్ గర్స్ తో చిందులేసిన ఘటన ఉత్తర్రపదేశ్ లోని మీర్జాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. అందుకు సంబంధించిన వీడియో ఒకటి ప్రస్తుతం వైరల్ అవుతోంది.

జమల్‌పూర్ లోని టెట్రాహియా కాలా కర్ద్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు సోమవారం రాఖీపండగ సందర్భంగా సెలవు ప్రకటించారు. ఆ మరుసటిరోజు స్కూల్‌కి వచ్చిన టీచర్లు షాక్‌కి గురయ్యారు. ప్రాంగణం అంతా ఖాళీ మందు సీసాలు పడి ఉండటంతో స్థానికులను ఆరాతీయగా, అదంతా గ్రామాధికారి చేసిన నిర్వాకమని తేలింది.

ఘటనపై అసిస్టెంట్ టీచర్ అశోక్‌కుమార్ విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్ తివారీకి ఫిర్యాదు చేయగా, ఆయన విచారణకు ఆదేశించారు. తన పుట్టినరోజు సందర్భంగా స్కూల్ లోనే పార్టీ ఇచ్చాడని, పైగా బార్ గర్ల్స్ తో చిందులు కూడా వేసినట్లు తేలింది. దీంతో రామ్‌కేష్ పై చర్యలు తీసుకోవాలని జిల్లామెజిస్ట్రేట్‌తోపాటు చీఫ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ను తివారీ కోరారు. తాను పార్టీ ఇచ్చిన మాట వాస్తవమేనని, అయితే అందులో తాను పాల్గొనలేదని రామ్‌కేష్ చెబుతున్నారు.

# పాకిస్థాన్‌కు షాకిచ్చిన కొరియా



సియోల్: అంతర్జాతీయ సంస్థలు, విదేశాల నుంచి పెద్ద ఎత్తున పెట్టుబడులు దేశంలోకి రప్పించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్న పాకిస్థాన్‌కు ఎదురుదెబ్బ తగిలింది. పాక్ ఆక్రమణలో ఉన్న కశ్మీర్, గిల్గిత్-బాల్టిస్థాన్‌లో పెట్టుబడులు పెట్టడానికి తాజాగా దక్షిణకొరియా నిరాకరించింది. ఈ ప్రాంతంలో చేపట్టే ప్రాజెక్టులకు ఆర్థిక సాయం అందించడానికి గతంలో ఆసక్తిచూపిన కొరియా.. వివాదాస్పద ప్రాంతంలో పెట్టుబడులు పెట్టలేమంటూ ఇప్పుడు చేతులెత్తేసింది.

గిల్గిట్-బాల్టిస్తాన్, ఆజాద్ కశ్మీర్ వివాదాస్పద ప్రాంతాలు కావడంతో ఇక్కడ పెట్టుబడులు పెట్టడానికి అనేక చట్టపరమైన సంక్లిష్టతలు ఉన్నట్టు గుర్తించడంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాంతాలు వివాదాస్పదమే కాకుండా.. ఇవి అధికారికంగా పాకిస్థాన్ రాజ్యంలో చేరలేదు. దీంతో ఇక్కడ నివసించే ప్రజల పౌరసత్వం మొదలు అనేక విషయాల్లో సంక్లిష్టతలు ఉన్నాయి. అంతేకాకుండా ఈ ప్రాంతాలు తమవేనని భారత్ స్పష్టం చేస్తూ వస్తున్నది. పాక్ ఆక్రమిత కశ్మీర్ మీదుగా చేపట్టిన చైనా-పాకిస్థాన్ ఆర్థిక కారిడార్ (సీపీఈసీ)పై సైతం భారత్ చాలా విస్పష్టంగా తన అభ్యంతరాన్ని వ్యక్తం చేసింది. సీపీఈసీకి భారత్ అభ్యంతరంతో ఈ ప్రాంతంలోని ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టడంపై ఇన్వెస్టర్లు ఇప్పుడు సందిగ్ధంలో పడ్డారు.

# సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్స్‌కు అమెజాన్ ఉద్యోగాలు

బెంగళూరు : అమెజాన్ తన రెండో అతిపెద్ద వర్క్‌ఫోర్స్ సెంటర్ అయిన భారత్‌లో ఉద్యోగవకాశాలు కల్పించాలని నిర్ణయించింది. 1000 మందికి పైగా ఉద్యోగులను భారత్‌లో నియమించుకోవాలని చూస్తోంది. వీరిలో ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్స్ తీసుకోవాలని భావిస్తున్నట్టు తెలిసింది. కంపెనీ భిన్నమైన వెర్షన్లు అంటే అమెజాన్.కామ్, అమెజాన్.ఇన్, డివైజ్‌ల బిజినెస్‌లలో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌కు, క్లౌడ్ కంప్యూటింగ్ డివిజన్ అమెజాన్ వెబ్ సర్వీసుల్లో ఈ నియామకాల ప్రక్రియ చేపట్టాలని భావిస్తోంది. సంబంధిత టెక్నాలజీల్లో ప్రతిభ ఉన్న వారికే ఈ నియామకాలను పరిమితం చేయాలని కంపెనీ నిర్ణయించినట్టు ఓ ఆంగ్ల సైటు రిపోర్టు చేసింది. బుధవారం సాయంత్రం అమెజాన్ తన వెబ్‌సైట్‌లోని కెరీర్ పేజీలో భారత్‌లో 1,245 స్థానాలను లిస్టు చేసింది.

ప్రస్తుతం అమెజాన్‌కు భారత్‌లో దాదాపు 50వేల మంది వరకు ఉద్యోగులున్నారు. అమెరికా తర్వాత అమెజాన్ రెండో అతిపెద్ద వర్క్‌ఫోర్స్ సెంటర్ భారతే.

గ్లోబల్‌గా ఈ సంస్థకు 3,41,000 మంది ఉద్యోగు లున్నారు. రీసెర్చ్ సైంటిస్టులు, డేటా అనాలిటిక్స్‌లు, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మిషన్ లెర్నింగ్, ఆండ్రాయిడ్ డెవలపర్స్ వంటి టెక్నాలజీల్లో ప్రతిభ ఉన్నవారి కోసం అమెజాన్ చూస్తున్నట్టు తెలుస్తోంది.

## కవి సమయం

### స్వార్థపరులు ప్రజలకు మంచి చేయరు

స్వార్థం అనేది మనిషికి ఉండే దుర్గుణాలలో ఒకటి. స్వార్థం వీడితే మనిషి మనస్సు దైవత్వంతో నిండిపోతుంది. అయితే నేడు అందరిలోనూ స్వార్థం ఎక్కువైపోయింది. దేశాన్ని నడిపించే నాయకులు, అధికారులు స్వార్థంతో దేశప్రగతికి తూట్లు పొడుస్తున్నారు. నాయకులు, అధికారులు స్వార్థచింతన మానితే మనదేశం బ్రహ్మాండంగా అభివృద్ధి చెందుతుంది. తమ వారికి మాత్రమే మేలు జరిగే పథకాలను ప్రవేశపెడుతున్నారు. తమకు అనుకూలమైన చట్టాలు చేస్తున్నారు. ఆ పార్టీ ఈ పార్టీ అవి ఏమీ లేదు. అంతా దొంగలే. ఖరీదయిన ఖద్దరు దొంగలు కాబట్టి మనం నాయకులను ఎన్నుకొనేటప్పుడు మంచి వ్యక్తిత్వం, సేవా దృక్పథం ఉన్నవారిని ఎన్నుకోవాలి. అప్పుడు మనకు మేలు కలుగుతుంది. రాజకీయ నాయకులు తమ విధులను నిజాయితీగా నిర్వర్తిస్తే అధికారులు కూడా సక్రమంగా పనిచేస్తారు. కానీ నేటి నాయకులు ఎన్నికలలో విపరీతంగా ధనాన్ని ఖర్చు చేసి అధికారంలోకి వచ్చాక దానికి పదిరెట్లు ప్రజాధనాన్ని స్వాహా చేస్తున్నారు. ప్రజలు కూడా నోట్లకి ఓట్లను అమ్ముకుంటున్నారు. స్వార్థపరులగు రాజకీయ నాయకుల గురించి ఓ శతకకవి ఇలా వ్రాశాడు.

'క్రూరమృగము నడవి గూల్చ వేటయగును
క్రూరు నూర గూల్చ నేరమగును
స్వార్థపరులు చేయు చట్టము లిట్లుండు
త్రిపురనేని వాణి తెలుగుబాణి'

...కవితా రచన
వడ్లమాని అన్నపూర్ణ

# పంచాంగం

మాసం : శ్రావణ : బ. చవితి రా. 10-29 పూ.భా.ఉ. 06-06
త.ఉ.భా.రా.తె. 05-54 వ.మ. 03-37ల 05-12

శుక్రవారం
11-08-2017

**మేషం :** క్రయ విక్రయ రంగాలలోని వారికి నూతన ఉత్సాహం కానవస్తుంది. కాంట్రాక్టర్లకు అధికమైన ఒత్తిడి తప్పదు. వాహన విషయంలో సంతృప్తి కానవస్తుంది. స్థిరాస్తి క్రయ విక్రయాలకు సంబంధించి ప్రముఖులతో సంప్రదింపులు జరుపుతారు. **వృషభం :** మీ కళత్ర మొండి వైఖరి, కుటుంబీకుల పట్టుదల మనశ్శాంతిని దూరం చేస్తాయి. ఇంటర్వ్యూలలో శ్రద్ధ వహించండి. విద్యార్థినులు ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండాలి. విద్యార్థులు ఉన్నత విద్యల కోసం విదేశాలు వెళ్లేందుకు మార్గం సుగమవుతుంది. ఇతరుల ఆంతరంగిక విషయాలలో తలదూర్చకండి. **మిథునం :** రావలసిన బకాయిల విషయంలో మెళుకువ అవసరం. సోదరీ, సోదరులతో ఏకీభావం కుదరదు. ఐరన్, సిమెంట్, కలప రంగాలలో వారికి చికాకులు తప్పవు. కోర్టు వ్యవహారాలు వాయిదా పడటం మంచిదని గమనించండి. లీజు, ఏజెన్సీ, నూతన కాంట్రాక్టులు అనుకూలిస్తాయి. స్నేహ పరిచయాలు విస్తరిస్తాయి. **కర్కాటకం :** ఆహార వ్యవహారాలలో మెళుకువ వహించండి. ఉద్యోగస్తులకు పై అధికారుల నుంచి మంచి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. స్త్రీలకు పనివారలతో ఒత్తిడి, చికాకులను ఎదుర్కొంటారు. మీ యత్నాలకు సన్నిహితుల ప్రోత్సాహం, సహకారం అందిస్తారు. ఖర్చులకు సరిపడు ఆదాయం సమకూర్చుకుంటారు. **సింహం :** మీ ఆదాయానికి మించి ఖర్చులు అధికమవుతాయి. మీ సంతానం చదువుల్లో బాగా రాణిస్తారు. నిర్మాణ పథకాలలో పురోభివృద్ధి కానవస్తుంది. ఉద్యోగస్తులు తోటివారి కారణంగా అధికారులతో మాటపడవలసి వస్తుంది. షేర్ మార్కెట్ రంగాల వారికి సామాన్యం. పండ్లు, పూలు, కూరగాయల వ్యాపారస్తులుకు లాభదాయకం. **కన్య :** లిటిగేషన్ వ్యవహారాలలో జాగ్రత్త వహించండి. ధనం సమయానికి అందుట వలన సంతృప్తి కానవస్తుంది. బంధుమిత్రులతో సంబంధ బాంధవ్యాలు బాగుగా ఉంటాయి. దైవ, పుణ్య, సేవా కార్యక్రమాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. విద్యార్థులు ఉన్నత విద్యల కోసం చేసే యత్నాలు అనుకూలిస్తాయి. ప్రయాణాలు అనుకూలిస్తాయి. **తుల :** కందులు, ఎండుమిర్చి, స్టాకిస్టులు, వ్యాపారస్తులు సంతృప్తి కానవస్తుంది. రవాణా రంగాలలో వారికి మిశ్రమ ఫలితం కానవస్తుంది. రచయితలకు, పత్రికా రంగంలో వారికి కీర్తి, గౌరవాలు పెరుగుతాయి. ప్రేమానుబంధాలు బలపడతాయి. రాజకీయాల్లో వారికి తెలివితేటలకు మంచి గుర్తింపు లభిస్తుంది. **వృశ్చికం :** కుటుంబీకుల నుంచి సమస్యలు తలెత్తే ఆస్కారం ఉంది. ఫ్యాన్సీ, సుగంధ ద్రవ్య, రసాయన వ్యాపారస్తులకు లాభదాయకం. ఉపాధ్యాయులు ఒత్తిడి సమస్యలకు లోనవుతారు. ఎదుటివారు మీకు సమఉజ్జీలేనని గ్రహించండి. గత అనుభవాలు జ్ఞప్తికి రాగలవు. రియల్ ఎస్టేట్ రంగాల వారికి నూతన వెంచర్లు అనుకూలిస్తాయి. **ధనుస్సు :** స్త్రీలకు నూతన వ్యక్తుల పరిచయం ఎంతో ఇబ్బంది కలిగిస్తుంది. మార్కెటింగ్ రంగాల్లో వారికి, పత్రికా, ప్రైవేటు సంస్థల్లో వారికి మార్పులు అనుకూలిస్తాయి. ఊహించని ఖర్చులు వల్ల స్వల్ప ఇబ్బందులు తప్పవు. విద్యార్థులకు అతి ఉత్సాహం వల్ల సమస్యలు తలెత్తుతాయి. **మకరం :** ఉపాధ్యాయులకు ఒక సమాచారం ఆసక్తి కలిగిస్తుంది. స్త్రీలు ప్రముఖుల సిఫార్సుతో దైవ దర్శనాలను త్వరగా ముగించుకుంటారు. నూతన అగ్రిమెంట్లు వాయిదా వెయ్యండి. శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. నిరుద్యోగులు భవిష్యత్ గురించి పథకాలు వేసిన సత్ఫలితాలు పొందుతారు. ఖర్చులు అధికమవుతాయి. **కుంభం :** ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. ప్రముఖులను కలుసుకొని బహుతమతులు అందజేస్తారు. రావలసిన డబ్బు చేతికి అందడం వల్ల ఆర్థిక ఇబ్బంది అంటూ ఉండదు. స్త్రీలు తేలికగా మోసపోయే ఆస్కారం కలదు. **మీనం :** ఆర్థిక విషయాల్లో ఒకడుగు ముందుకు వేస్తారు. కాంట్రాక్టర్లకు అధికారులతో అవగాహన కుదరదు. కోర్టు వ్యవహారాల్లో ప్లీడర్లకు, ప్లీడరు గుమస్తాలకు ఒడిదు డుకులు తప్పవు. కొంత మంది మీ సహాయం పొంది మిమ్మల్ని తక్కువ అంచనా వేయటం వల్ల ఆందోళనకకు గురవుతారు.

# పసుపు కుంకుమలతో ప్రకాశించే కాశీ విశాలాక్షి!

## సంకీర్తన



అయోధ్య, మధుర, హరిద్వార్, కాంచీపురం, కాశీ, ఉజ్జయిని, ద్వారక సప్త మోక్షప్రదాయికాల్లో కాశీక్షేత్రం శ్రేష్టమైనది. ఈ పుణ్యస్థలంలో మహావిష్ణువు ముక్కంటిని పూజించినట్లు పురాణాలు చెబుతున్నాయి. ఓ సారి సూర్య భగవానుడు ఆకాశ మార్గాన్ని వెళ్తుండగా, మహా విష్ణువు కాశీలో శివలింగపూజలో లయించి ఉండటం గమనిస్తాడు. ఉమాపతి కొలువైన ఈ పుణ్య స్థలంలో పూజలు చేస్తే అత్యంత పుణ్య ఫలం లభిస్తుందని మహా విష్ణువుచే తెలుసుకుని ఆదిత్యుడు ఆ ప్రాంతంలో లింగాన్ని స్థాపించి పూజించసాగాడు. మహావిష్ణువు మాత్రమే గాకుండా, సృష్టి కర్త బ్రహ్మకూడా ఈశ్వరుని వేడు కుంటూ పది అశ్వమేథ యాగాలను చేశాడు. ఇప్పటికీ దశాశ్వమేథఘాట్ అనే పుణ్య తీర్థాన్ని కాశీలో చూడగలు గుతాం. ఈ దశాశ్వమేథఘాట్‌కు ఇప్పటికీ బ్రహ్మదేవుడు పూజలు చేస్తుంటాడని ప్రతీతి. అటువంటి ఈ పుణ్య స్థలిలో భక్తులను బ్రోచే జగన్మాత విశాలాక్షిగా కొలువైంది. ఈ శక్తిపీఠంలో విశాలాక్షి గర్భాలయంలో రెండు రూపా లతో దర్శనమిస్తుంది. ఒకరూపం స్వయంభువు. మరొక రూపం అర్చామూర్తి. మనం ఆలయంలోని ప్రవేశించగానే ముందుగా అర్చామూర్తిని, అటు పిమ్మట స్వయం భువును దర్శించుకోవాలి. పసుపు కుంకుమలతో ప్రకాశిస్తూ, పుష్పమాలాంకృతురాలైన ఆమెను భక్తులు మనసారా పూజిస్తే కోరిన కోరికలు తప్పక నెరవేరుతాయని విశ్వాసం. బ్రహ్మ దేవుని మాట ప్రకారం.. దక్షుడు తన కూతురు సతీదేవిని శివునికిచ్చి పెళ్లి చేశాడు. సతీసమేతంగా శివుడు కైలాసములో ముల్లోకవాసుల పూజలందు కుంటున్నాడు. కొంతకాలం తర్వాత ప్రయాగ క్షేత్రంలో నవ బ్రహ్మలు సత్రయాగాన్ని చేయ సాగారు. ఆ యాగానికి త్రిమూర్తులతో పాటు అష్ట దిక్పా లకులు, ప్రజాపతులు, దేవతలు, మును లంతా విచ్చేశారు. ఆ సమయంలో దక్షప్రజాపతి యాగ శాల లోకి ప్రవేశించాడు. దక్షుని రాకను చూసిన దేవతలంతా లేచి నిలబడి స్వాగతించారు. అయితే శంకరుడు కదల లేదు. శంకరుని చర్యను దక్షుడు అవమానంగా భావించాడు. శివుని చర్య వలన ధర్మం కుంటుపడుతోంది. అతడు నాకు అల్లుడైనందున శిష్యునితో సమానం. కాబట్టి నేను వచ్చినప్పుడు లేచి నిలబడి నన్ను గౌరవించాలి. నా కూతురిని ఇటువంటి దిగంబరికి, ఎముకలను నగలుగా ధరించేవానికి ఇచ్చినందుకు చింతిస్తున్నాను. ఇకపై ఇతని యాగాలలో హవిర్భాగాలు ఉండవని దక్షుడు నిందించాడు. అప్పటికీ శివుడు మౌనంగానే ఉన్నాడు. ఈ సంగతిని విన్న నందీశ్వరుడు కోపంతో దక్షుని ముఖం మేక ముఖమై పోతుందని శపిస్తాడు.

నందికి కూడ హవిర్భాగాలు లేవని దక్షుడు మళ్లీ నిందించాడు. అంతటితో దక్షుని కోపం చల్లారలేదు. బృహస్పతి సవనమనే మహాయాగాన్ని చేయ సంకల్పించి, ఆ యాగానికి సమస్త దేవతలను ఆహ్వానాలు పంపాడు. కానీ తన కుమార్తైన సతీదేవికి, అల్లుడు శివునికి ఆహ్వానాలు పంపించలేదు. యజ్ఞానికి దేవతలంతా వచ్చారు. అందరూ దక్షుని యజ్ఞానికి శివుడు ఎందుకు రాలేదని ప్రశ్నించ సాగారు.

అందుకతడు శివుని రకరకాలుగా తూలనాడసాగాడు. దేవతలు దాన్ని సహించలేకపోయారు. ఈలోపు కైలాసంలో ఉన్న సతీదేవికి తన తండ్రి చేస్తున్న యాగానికి తనను ఆహ్వానించలేదనే కోపంతో, శివుని మాటను సైతం లెక్క చేయకుండా యజ్ఞశాలకు వెళ్లి, అక్కడ తండ్రిచే అవమానింపబడి యోగాగ్నిలో దగ్ధమైంది. ఆ సంభవాన్ని చూసిన రుద్రగణాలు యాగశాలను బీభత్సం చేయసాగాయి.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

# నులిపురుగులు నివారిద్దాం

## జిల్లా వైద్యాధికారి ప్రవీణ్‌చందర్



సిద్దిపేట : జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 9 నెలల నుంచి 19 సంవత్సరాల వయస్సున్న వారికి నులిపురుగుల నివారణ మాత్రలు అందించ నున్నట్లు జిల్లా వైద్యాధికారి ప్రవీణ్‌చందర్ తెలిపారు. సిద్దిపేట జిల్లా ఆసుపత్రిలో ఆయన మాట్లాడుతూ... ఇందులో భాగంగా గురువారం అంగన్‌వాడీ, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో 2,43,457 మందికి అల్బెండజోల్ మాత్రలు ఇస్తామన్నారు. 1-2 ఏళ్ల వయసున్న పిల్లలకు అర మాత్రను నీళ్లలో కలిపి కుర్చోబెట్టి తాగించాలన్నారు. రెండేళ్ల వయస్సు పైబడి 19 ఏళ్ల వరకు 400 గ్రాముల మాత్రను మింగించాలన్నారు. సాధారణంగా నాలుగు రకాల నులి పురుగులు ఉంటాయనీ, వీటి వల్ల రక్తహీనత, బలహీనత, ఏకాగ్రతలోపం, ఎదుగుదల లోపించడం, కాళ్లు, చేతులు లాగడం వంటివి వస్తాయన్నారు. ఫలితంగా విద్యార్థులు గైర్హాజర వుతారని తెలిపారు. దాదాపు 25 శాతం మంది విద్యార్థుల గైర్హాజరీకి ఇదే కారణమన్నారు. 2015లో తొలిసారిగా ప్రభుత్వం ఈ కార్యక్రమం తలపెట్టిందనీ, ఏటా మూడు సార్లు మాత్రలు వేస్తున్నామన్నారు. మిగిలిపోయిన వారికి 23వ తేదీన వేస్తామన్నారు. వీటిని వేసుకోవడం వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్ ఉండదని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పిల్లలకు తప్పక వేయించాలన్నారు. 315 మంది ఏఎన్ఎం, 33 మంది వైద్యులు, ముగ్గురు కార్యక్రమ అధికారులు ఇందులో భాగస్వాము లు అవుతారన్నారు.

మాత్రలు వేయించి పిల్లల ఆరోగ్యాన్ని కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు పీటర్‌సన్, నర్సింహా, పాండురంగాచారి, ప్రభాకర్, ఉద్యోగి చక్రధర్ పాల్గొన్నారు. అంతకుముందు నులిపురుగుల నివారణ ర్యాలీని జేసీ పద్మాకర్ జెండా వూపి ప్రారంభించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా వైద్యాధికారి ప్రవీణ్ చందర్, ఐసీడీఎస్ పీడీ స్వప్న, జిల్లా మలేరియా అధికారి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్తు ఒప్పంద కార్మికుల ఆందోళన భగ్నం

పాల్వంచ : విద్యుత్తు ఒప్పంద కార్మికుల విలీన ప్రక్రియ ఆందోళనను పోలీసులు భగ్నం చేశారు. విద్యుత్తు సంస్థల్లో ఒప్పంద కార్మికులను విలీనం చేయాలని, ఆత్మహత్య చేసుకొన్న నాగేశ్వరరావు కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ అఖిలపక్షం నాయకులు, ఒప్పంద కార్మికులు ఆందోళన చేపట్టారు. యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తుండడంతో పోలీసులు బలవంతంగా ఆందోళనకారుల్ని అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదాలు, తోపులాటలతో ధర్నా ప్రాంతం రణరంగాన్ని తలపించింది. మృతుడు నాగేశ్వరరావు భార్యా పిల్లలు, బంధువుల్ని సైతం స్టేషన్‌కు తరలించారు. మృతదేహాన్ని మాత్రం పోలీసులు ఇంటికి తీసుకెళ్లారు.

కేటీపీఎస్ ఐదో దశ క్యామ్ డివిజన్‌లో పని చేస్తున్న కేశబోయిన నాగేశ్వరరావు(38) విలీన ప్రక్రియలో తన పేరు లేదని మనస్తాపానికి గురై అధికారుల ఎదుటే పురుగుమందు తాగి మృతి చెందిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో అఖిలపక్షం నాయకులు వనమా వెంకటేశ్వర రావు, కూనంనేని సాంబశివరావు, పోతినేని సుదర్శన్‌రావు ఒప్పంద కార్మికులతో కలిసి కేటీపీఎస్ ఎదుట మృతదేహాన్ని ఉంచి ఆందోళన చేపట్టారు. మృతుని కుటుంబానికి నష్టపరిహారం, ఇంట్లో ఒకరికి ఉద్యోగం, విలీనం కాని ఒప్పంద కార్మికులందర్ని విలీనం చేయాలని డిమాండ్ చేశారు. థర్మల్ డైరెక్టర్ సచ్చిదానందం, సీఈ టీఎస్ఎన్ మూర్తితో అఖిలపక్షం నాయకులు చర్చలు జరిపినప్పటికీ విఫలమయ్యాయి. దీంతో నాయకులు అక్కడే బైఠాయించి యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆందోళన తీవ్రరూపం దాల్చుతుండడంతో పోలీసులు బలవంతంగా అరెస్టులు ప్రారంభించారు.

# కార్మికుల సమస్యల పరిష్కారమయ్యే వరకు పోరాటం

## దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో జిల్లా అఖిలపక్ష నాయకులు

దమ్మపేట : తెలంగాణ కొద్దిమంది చేతుల్లో నలిగిపోతోంది. మాట్లాడే స్వేచ్ఛ లేదు. కార్మికుల, పేదల ప్రాణాలకు విలువలేదు. ఇదేనా మనం కోరుకొన్న తెలంగాణ అంటూ అఖిలపక్ష నాయకులు మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శన్ ప్రభుత్వం తీరుపై ధ్వజమెత్తారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు. పాల్వంచ పట్టణంలో కేటీపీఎస్ ఒప్పంద కార్మికుడు కేశబోయిన నాగేశ్వరరావు ఆత్మహత్యకు పాల్పడిన నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా 15 మంది అఖిలపక్ష నాయకులకు పాల్వంచ పోలీసులు అదుపులోకి తీసుకొని దమ్మపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకొన్న కాంగ్రెస్, తెదేపా, సీపీఐ, సీపీఎం, వైకాపా, న్యూడెమోక్రసీ నాయకులు, కార్యకర్తలు భారీగా పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో వనమా వెంకటేశ్వరరావు మాట్లాడారు. కార్మికుడు నాగేశ్వరరావు మృతికి కారణమైన కేటీపీఎస్ అధికారులు, ఎస్ఈ, డీఈఈలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగం విషయంలో అన్యాయం జరిగిందని వెళ్లిన వ్యక్తిని, ఆత్మహత్య చేసుకొనేలా వారు మాట్లాడారని ఆరోపించారు. కళ్లెదుటే పురుగుమందు తాగుతున్నా, కనీసం అడ్డుకొనే ప్రయత్నాలు వారు చేయలేదన్నారు. లోగడ ఉద్యోగాలు విలీనం చేసిన వారిపై మాకు అభ్యంతరం లేదు. అన్యాయం జరిగిన కార్మికులందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మృతుని భార్యకు ఉద్యోగం, నష్టపరిహారం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రజలు నిత్యం భయంతో బతుకుతున్నారని మాజీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ప్రజలు కోరుకొన్న తెలంగాణ ఇది కాదని ఆయన స్పష్టం చేశారు. కార్మికుడు నాగేశ్వరరావు మృతికి కారణమైన ఉద్యోగులను తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కొత్తగూడెం ఎమ్మెల్యే జలగం వెంకటరావుపై ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు.

రాష్ట్రంలో నియంత పాలన సాగుతుందని సీపీఎం రాష్ట్ర నాయకుడు పోతినేని సుదర్శన్ ధ్వజమెత్తారు. సమావేశంలో ఆయా పార్టీల నాయకులు కోసాల శ్రీనివాసరావు, మచ్చా వెంకటేశ్వరరావు, ఏ.జే రమేష్, సాబీర్‌పాష, అన్నవరపు



సత్యనారాయణ, ముత్యాల విశ్వనాథం తదితరులు ఉన్నారు.

దమ్మపేట పోలీస్‌స్టేషన్‌లోని అఖిలపక్ష నాయకులను టి.పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కార్మికుల, పేద, బలహీన వర్గాల శ్రమ దోపిడీ జరుగుతుందన్నారు.

పోలీసుల అదుపులో ఉన్న అఖిలపక్ష నాయకులకు పలువురు రాష్ట్ర, జిల్లాస్థాయి నాయకులు పరామర్శించారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, తెదేపా రాష్ట్ర కార్యదర్శి మెచ్చా నాగేశ్వరరావు, మహిళా కాంగ్రెస్ నాయకురాలు సున్నం నాగమణి, సీపీఎం నాయకులు దొడ్డా లక్ష్మీనారాయణ, పిట్టల అర్జున్, సీపీఐ నాయకులు యార్లగడ్డ భాస్కర్‌రావు, సలీం, కాంగ్రెస్ నాయకులు కారం శ్రీరాములు, వాసం శ్రీను, తేదేపా మండల అధ్యక్షుడు నాయుడు చెన్నారావు, చిన్నంశెట్టి యుగంధర్ సహా పలువురు పరామర్శించారు.

ఒప్పంద కార్మికుడు నాగేశ్వరరావు అంత్యక్రియలు ముగిసిన అనంతరం, డీఎస్పీ ఆదేశాల మేరకు దమ్మపేట పోలీసులు అఖిలపక్ష నాయకులను విడుదల చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అశ్వారావుపేట సీఐ రవికుమార్, ఎస్సైలు జె.ప్రవీణ్, సురేష్‌లు బందోబస్తు నిర్వహించారు.

# ఆలయంలో ఆధ్యాత్మిక పర్వాలు



యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట బాలాలయంలో ఆధ్యాత్మిక పర్వాలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. శ్రీ లక్ష్మీనరసింహస్వామిని ఆరాధిస్తూ హారతిని నివేదించిన పూజారులు ఉత్సవమూర్తులను పాలతో అభిషేకించారు. వేదమంత్రాల మధ్య తులసీ అర్చన జరిగింది. నిత్యకార్యక్రమాల్లో భాగంగా మండపంలో శ్రీ లక్ష్మీనరసింహుల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. పూజారులు మంత్రోచ్ఛరణలతో జరిపిన కల్యాణోత్సవంలో గజవాహనోత్సవాన్ని చేపట్టారు. పలువురు భక్తులు కల్యాణంలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి ప్రతిష్ఠమూర్తులకు ఆరాధన, సహస్రనామార్చన నిర్వహించారు. చరమూర్తుల ఆలయంలో రామలింగేశ్వరుడిని ఆరాధిస్తూ నిత్యపూజలు కొనసాగాయి. అనుబంధంగా కొనసాగుతున్న పాతగుట్టలోనూ శ్రీ లక్ష్మీనరసింహస్వామికి నిత్యారాధనలు శాస్త్రోక్తంగా జరిపారు.

## నిత్యరాబడి

యాదగిరిగుట్ట: య్రాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయ ఖజానాలో వివిధ విభాగాల ద్వారా రూ.5,15,060 నిత్యరాబడి పద్దు కింద జమయ్యాయని దేవస్థానం ఈవో ఎన్.గీత తెలిపారు. ఈ రాబడిలో ప్రధాన పూజలతో రూ.57,104, ప్రత్యేక దర్శనాలతో రూ.16,500, వ్రతాలతో రూ.61,500, కల్యాణకట్టతో రూ.20,000, అద్దె గదులతో రూ.54,600, శాశ్వత పూజలు రూ.2,232, అన్నప్రసాదం రూ.3,232, ప్రసాదాల విక్రయం ద్వారా 2,21,465 చేకూరాయని ఈఓ వివరించారు.

# నగరాన్ని ముంచెత్తిన వర్షం

ఖమ్మం : ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పలుచోట్ల భారీ వర్షం కురిసింది. సుమారు రెండు గంటలపాటు ఖమ్మం నగరాన్ని భారీ వర్షం ముంచెత్తింది. ఫలితంగా పంపింగ్ హౌజ్, దాన్వాయిగూడెం, వరదయ్యనగర్, కవిరాజునగర్ తదితర ప్రాంతాలు పూర్తిస్థాయిలో జలమయమయ్యాయి. బస్టాండు సమీపంలోని సుమారు 200 మీటర్ల వరకు ఎటుచూసినా నీళ్లు దర్శనమిచ్చాయి. బస్సుల రాకపోకలు సుమారు అరగంటకు పైగా నిలిచిపోయాయి. ప్రధాన రహదారిపై వరదకాలువను తలపించేలా నీటి ప్రవాహం కొనసాగింది. గోళ్లపాడు ఛానల్‌లో నీరు కదలాడింది. చింతకాని మండలంలో భారీ వర్షం కురిసింది. తిరుమలాయపాలెం, కూసుమంచి లోనూ మోస్తారుకు మించి వర్షం కురిసింది. తిరుమలాయపాలెం మండలంలో 55 ఎంఎంలు, కూసుమంచి మండలంలో 30 ఎంఎంలు, ఖమ్మం గ్రామీణ మండలంలో 108.4 ఎంఎంలు, ఏన్కూరు మండలంలో 16.0 ఎంఎం, ఎర్రుపాలెం మండలంలో 12.2 ఎంఎం, కూసుమంచి మండలంలో 3.5 ఎంఎం, కామేపల్లి మండలంలో 2.2 ఎంఎం, కారేపల్లి 5.5 ఎంఎంల కంటే ఎక్కువ వర్షపాతం నమోదు చేసుకుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలంలో 2.6 ఎంఎం, చర్ల మండలంలో 11.2 ఎంఎం, అశ్వాపురం మండలంలో 0.6 ఎంఎం, మణుగూరు మండలంలో 1.4 ఎంఎం, చంద్రుగొండ మండలంలో 4.4 ఎంఎం, బూర్గంపాడులో 1.0 ఎంఎంల వర్షపాతం నమోదు చేసుకుంది. ఇల్లెందు, టేకులపల్లి తదితర మండలాల్లో చిరుజల్లులు కురిశాయి. కొంతకాలంగా వర్షాలు ముఖం చాటేశాయి. తాజాగా కురిసిన వర్షం ఆరుతడి పంటలకు జీవం పోసినట్లుగా మారింది.

# 3.45 కోట్ల చేపపిల్లల పంపిణీ లక్ష్యం



బోధన్ : రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులకు జీవనోపాధి కల్పించి ఆర్థికంగా బలోపేతం చేయాలన్న సంకల్పంతో ఉచితంగా చేపపిల్లల పంపిణీ చేపట్టిందని మత్స్యశాఖ ఏడీ మహిపాల్ పేర్కొన్నారు. బోధన్ మండల పరిషత్ కార్యాలయంలో డివిజన్‌కు చెందిన అధికారులు, మత్స్యశాఖ సహకార సంఘాల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు.

2017-18 సంవత్సరానికి సంబంధించి సమగ్ర మత్స్య అభివృద్ధి పథకం ద్వారా జిల్లాలో 3.45 కోట్ల చేప పిల్లలను చెరువుల్లో వదిలేందుకు లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ఏడాది వంద ఎకరాల విస్తీర్ణం కలిగిన 667 చెరువుల్లో వదిలేందుకు కార్యాచరణ రూపొందించామన్నారు. వాటి పెంపకంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

పెద్ద మొత్తంలో చేప పిల్లలు మృతిచెందుతుంటే తక్షణమే అధికారులకు సమాచారం అందించాలని కోరారు. సమావేశంలో మత్స్యశాఖ సహకార సంఘ జిల్లా అధ్యక్షుడు సాయిబాబా, డైరెక్టర్ లక్ష్మణ్, బోధన్, రెంజల్, ఎడపల్లి, వర్ని, కోటగిరి మండలాలకు చెందిన తహసీల్దార్లు గంగాధర్, వినయ్‌సాగర్, విఠల్, ఎంపీడీవోలు మల్లారెడ్డి, గోపాలకృష్ణ, రాజేశ్వర్, వేణుగోపాల్, డివిజన్‌లోని 52 సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఏబీవీపీ కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం

మహబూబ్‌నగర్ : విద్యారంగ సమస్యల పరిష్కారంలో భాగంగా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్తు ఆధ్వర్యంలో చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని జిల్లా కేంద్రంలో ఏబీవీపీ నాయకులు భారీ ర్యాలీ నిర్వహించి తెలంగాణ కూడలిలో బైఠాయించి ధర్నా చేపట్టారు. ఇంతలోనే కొందరు ఏబీవీపీ నాయకులు కలెక్టరేట్ వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డగించారు. పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఏబీవీపీ నాయకులు రెండు బృందాలుగా విడిపోయి కలెక్టరేట్ ప్రధాన ముఖద్వారం వద్దకు చేరుకుని గేట్లు ఎక్కి కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లారు. లోపలికి వెళ్లిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు తమపై పరుష పదజాలంతో తిట్టడంతో పాటు భౌతిక దాడి చేశారని ఏబీవీపీ నాయకులు ఆరోపించారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ శ్రీధర్ మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులపై పోలీసులు దాడి చేయడం అత్యంత దారుణం అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న న్యాయమైన డిమాండ్ల సాధనలో భాగంగా సామాజిక, నైతిక హక్కుగా నిరసన తెలపడం మేం చేసిన తప్పా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీఎంబర్స్‌మెంట్, ఉపకారవేతనాలు రూ.4వేల కోట్లు వెంటనే విడుదల చేయాలన్నారు. డిగ్రీ కళాశాలల్లో పెంచిన ఫీజులు తగ్గించాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీ హాస్టల్స్‌లో డిపాజిట్ల పేరుతో విద్యార్థులను ఎందుకు పీడిస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. రాము, అంజి, శ్రీనాథ్, బద్రీ, మల్లేష్, రాజు, సుదర్శన్, నవీన్, అనిల్, నర్సింహ్మా, శివ, మహేష్, బాలు, రఘు, శ్రీధర్, సురేష్ పాల్గొన్నారు. ఏబీవీపీ నేతలపై పోలీసులు దౌర్జన్యానికి పాల్పడడాన్ని నిరసిస్తూ జిల్లావ్యాప్తంగా 10వ తేదీన కళాశాలల బంద్ నిర్వహించారు.

# సానుకూల దృక్పథంతో ఏదైనా సాధించవచ్చు

## మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్



మహబూబ్‌నగర్ : విద్యార్థులు ఎప్పుడూ పరిమితంగా ఆలోచించొద్దు.. విస్తృతంగా ఆలోచించాలి.. దేనిపైనైనా నమ్మకం పెంచుకోవాలి తప్ప సందేహాలు కూడదు. సానుకూల దృక్పథంతో ఏదైనా సాధించవచ్చు. అందుకే విద్యార్థులు కలలు కనాలి.. ఇలలో వాటిని సాకారం చేసుకోగలగాలి అని మాజీ క్రికెటర్, ఏఏ ఎజుటెక్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకులు కృష్ణమాచారి శ్రీకాంత్ పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ మండలం చౌదరిపల్లిలోని జేపీఎన్‌సీఈ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో కృష్ణమాచారి శ్రీకాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన బీటెక్, పాలిటెక్నిక్ విద్యార్థులతో ముమేకమై వారి ఆలోచనలు పంచుకున్నారు. ఒక్కో విద్యార్థి చేతికి మైకు ఇచ్చి భవిష్యత్తులో ఏమవుదామని అనుకుంటున్నావో చెప్పాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తు కార్యాచరణ పరిశీలించిన శ్రీకాంత్ విద్యార్థులు ఇంకా ఎలా ఉండాలో ఉండగలగాలో తన ప్రసంగం ద్వారా చైతన్యం చేశారు. విద్యార్థులు పరిమితంగా ఆలోచిస్తున్నారని, ముఖ్యంగా ఇంజనీరింగ్ విద్యార్థుల ఆలోచనలు పరిమితంగా ఉండొద్దని సూచించారు. మనం ఎక్కడనుంచి వచ్చామో ఆలోచించరాదని, ఈరోజు దేశంలోనే గొప్పగా చెప్పుకుంటున్న భారత క్రికెట్ జట్టు మాజీ సారథి ధోనీ, ఆటగాళ్లు సురేష్‌రైనా, యూసుఫ్‌పఠాన్ సైతం మారుమూల ప్రాంతం నుంచి వచ్చినవాళ్లేనని గుర్తుచేశారు. 24 ఏళ్లపాటు క్రికెట్ ప్రపంచాన్ని ఏలిన టెండూల్కర్ సైతం ముంబయిలోని ఓ చిన్న వీధికి చెందిన కుర్రాడేనన్నారు. మనిషి పట్టుదలతో ఇష్టంతో ముందుకు వెళ్తే ఏదైనా సొంతం అవుతుందన్నారు. విద్యార్థులు ఒక్కో మెట్టు ముందుకు వెళ్లాలే తప్ప పరిమిత ఆలోచనలతో ఆగిపోవొద్దన్నారు. ఇక్కడ చదువు పూర్తి చేసుకున్న విద్యార్థులు ఉన్నత ప్రమాణాలతో మరింత ముందుకు సాగాలని, అప్పుడే అనుకున్న లక్ష్యంతో జీవితంలో సుస్థిరత పొందుతారని పేర్కొన్నారు. కళాశాలలో టాస్క్, ఏఏ ఎజుటెక్ సంస్థల ద్వారా వివిధ రంగాల్లో నైపుణ్యాలను వృద్ధి చేసుకోవాలని, ముఖ్యంగా ఆంగ్లంలో పట్టును సాధించాలని శ్రీకాంత్ సూచించారు. వివిధ విభాగాల్లో బీటెక్ పూర్తిచేసిన 240 మంది విద్యార్థులకు, అలాగే టాస్క్ సంస్థ ద్వారా నైపుణ్య రంగాల్లో శిక్షణ పొందిన 60 మంది విద్యార్థులకు ఈ సందర్భంగా కృష్ణమాచారి శ్రీకాంత్ కళాశాల ఛైర్మన కేఎస్.రవికుమార్, టాస్క్ సీఈఓ సుజీవ్‌నాయర్, టాస్క్ ఓఎస్డీ డా.శైలజ, స్కిల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డా.వీకే.స్వామితో కలిసి గ్రాడ్యుయేషన్ ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జేపీఎన్‌సీఈ కళాశాల వైస్‌ఛైర్మన్ భాస్కర్, కార్యదర్శి వెంకటరామారావు, కళాశాల అకడమిక్ డీన్ లింగన్‌గౌడ కులకర్ణి, డైరెక్టర్లు శ్రీనివాసులు, సతీశ్, ప్రిన్సిపల్ డా.ఎస్.మురళీ, పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


# చేగుంటలో లక్ష మొక్కలు నాటిన అధికారులు



చేగుంట : హరితహారంలో భాగంగా ఒకే రోజు లక్ష మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేగుంట మండలంలో విజయవంతం చేశారు. ముందుగా జిల్లా పాలనాధికారి భారతి హోళికెరి రుక్మాపూర్ అటవీ ప్రాంతంలో మొక్కలు నాటారు. ఉపాధి హామీ పథకంలో ఉమ్మడి చేగుంట మండలంలో ఉన్న అటవీ ప్రాంతంలో 1,04,600 మొక్కలను విజయవంతంగా నాటారు. వర్షం కురవడంతో మొక్కలు నాటేందుకు అనువుగా మారింది. రుక్మాపూర్, కసాన్‌పల్లి అటవీ ప్రాంతంలో కలెక్టర్ స్వయంగా మొక్కలు నాటుతూ పారపట్టుకొని గుంతలను పూడ్చివేశారు. అందరిలో ఉత్సాహం నింపారు. కలెక్టర్ స్ఫూర్తితో ప్రతి అధికారి పదికిపైగా మొక్కలు నాటారు. కలెక్టర్ అటవీ ప్రాంతాలతో పాటు ఇబ్రహీంపూర్, చందాయిపేటలో కూడా మొక్కలు నాటారు. ఇలా రికార్డు స్థాయిలో ఒకే రోజు మొక్కలు నాటి ఆదర్శంగా నిలిచింది చేగుంట మండలం. కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి పద్మజారాణి, చేగుంట, నార్సింగి మండలాల ప్రత్యేకాధికారులు వెంకటరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తూప్రాన్ ఆర్డీవో మధు, తహసీల్దారు విజయలక్ష్మి, ఎంపీడీవో అనిల్‌కుమార్, ఎంపీపీ అల్లి రమ, ఈవోపీఆర్‌ఈడీ ఉమాదేవి, రామాయంపేట రేంజ్ అధికారి చంద్రశేఖర్, ఏవో చైతన్య, డిప్యూటీ రేంజ్ అధికారులు అనురాధ, కుత్బొద్దీన్, సర్పంచులు నాగభూషణం, శ్యామల, నాగరాణి, ఉపాధి హామీ ఏపీవో ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు మొక్కలు నాటేందుకు ముందుకు వస్తే హరితహారం కార్యక్రమం పూర్తిస్థాయిలో విజయవంతం అవుతుంది. ఒకేరోజు లక్షకు పైగా మొక్కలు నాటడం గొప్ప విషయం. చేగుంటలో మాదిరిగా జిల్లాలో ఇతర మండలాలు కూడా ముందుకు రావాల్సిన అవసరం ఉంది. నాటిన ప్రతి మొక్కకు జియోట్యాగింగ్ చేయాలి. చేగుంట మండలంలో అటవీ ప్రాంతంలో మైదాన భూములను గుర్తించడంలో అధికారులు చొరవచూపారు. నాటిన ప్రతి మొక్కను కాపాడితే అనతికాలంలోనే వనాలుగా మారతాయి.

# చిగుళ్ల వ్యాధి.. లక్షణాలు.. చికిత్స




మన దేశంలోని చాలామంది లో చిగుళ్ల జబ్బులతో బాధపడే వారు ఎక్కువ. ఈ చిగుళ్ల వ్యాధులు ముదిరిపోయి, సమస్య పంటి ఎముక వరకూ వ్యాపిస్తే గానీ సాధారణంగా నొప్పి ఉండదు. అందుకే చిగుళ్ల వ్యాధులను గుర్తించడం అంత తేలిగ్గా సాధ్యంకాదు. అవగాహన కూడా తక్కువే. కొన్ని ప్రాథమిక లక్షణాలు ఉన్నప్పుడు చిగుళ్ల వ్యాధి ఉన్నట్లు గుర్తించి దాన్ని సరిచేసుకోవాలి. చిగు ళ్లు వ్యాధిలో రెండు దశలు ఉంటాయి అవి.

**జింజివైటిస్:**

ఈ దశలో చిగుళ్ల జబ్బు తీవ్రత అంతగా ఉండదు. చిగుళ్లు ఎర్రగా వాచి ఉంటాయి. ముట్టుకుంటే జివ్వుమంటాయి. బ్రష్ చేసు కున్నప్పుడు రక్తస్రావం కావచ్చు. అయితే మన దేశంలో సాధారణంగా ఏదో కారణంవల్లగానీ, బ్రష్ చేసుకునే సమయంలో ప్రతి ఐదుగురిల ముగ్గురికి రక్తస్రావం ఉంటుంది. పైగా జింజి వైటిస్‌ల నొప్పి ఉండదు. ఈ కారణాలవల్ల చాలా సందర్భాల్లో ఏళ్ల తరబడి ఈ వ్యాధిని గుర్తించలేని పరిస్థితి ఉంటుంది. అందువల్ల సాధారణంగా దంతవైద్యులను కలిసినప్పుడు ఈ వ్యాధి బయటపడుతుంది.

**పెరియోడాంటైటిస్:**

ఈ దశలో ఇన్ఫెక్షన్ తీవ్రత ఎక్కువగా ఉండి చిగుళ్లలో పుండ్లు ఏర్పడటం, దంతాలు దూరంగా జరిగిపోవడం, దంతాల మధ్య సందులు పెరగడం జరుగుతాయి. దీంతో శాశ్వత దంతాలు వదులుకావడం, ఊడిపో వడం కూడా జరుగవచ్చు. దంతం ఎముక వరకు వ్యాధి పాకడం వల్ల జింజివైటిస్ అన్న చిన్న సమస్య పెరియోడాంటైటిస్ దశకు చేరుకుంటుంది. కొద్దిపాటి ముందుజాగ్రత్త లతో జింజివైటిస్ దశ, పెరియోడాంటైటిస్ దశలోకి మారకుండా నివారించవచ్చు.

**వ్యాధిని గుర్తించడం (డయాగ్నోజ్) ఇలా:**

**నోటి దుర్వాసన..**

నోటి దుర్వాసన సమస్యను వైద్య పరిభాషల హెలిటోసిస్ అంటారు. దాదాపు 80 శాతానికిపైగా చిగుళ్ల వ్యాధి వల్లనే నటి దుర్వాసన వస్తుంటుంది. కేవలం 20శాతం మందిలో మాత్రమే ఇది అసిడిటీ, సైనసైటిస్, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌వల్ల కావచ్చు. ఇది ఒక సాంఘిక సమస్య. సాధారణంగా దీనివల్ల కుటుంబ సభ్యులే ఎక్కువగా ఇబ్బందిపడ తారు. ఈ సమస్య కనిపించినప్పుడు చిగుళ్ల వ్యాధి ఉందేమనని అనుమానించి తప్పని సరిగా దంతవైద్యులను సంప్రదించాలి. పళ్లు వదులుకావడం అన్న బాహ్య లక్షణంతో, ఒక్కోసారి పళ్లు ఊడిపోవడంతో, ఎక్స్‌రే పరీక్షతో చిగుళ్లపై తీవ్రత ఏ మేరకు ఉందో గుర్తించవచ్చు.

**లక్షణాలు:**

సాధారణంగా చిగుళ్ల వ్యాధులను ఈ కింది లక్షణాలతో గుర్తించవచ్చు.

బ్రష్ చేసినప్పుడు, ఏదైనా గట్టి వస్తువును కొరికినప్పుడు చిగుళ్ల నంచి రక్తం కారడం. నోటిలో ఎక్కువగా లాలాజలం ఊరుతున్నట్లు అనిపించడం. చిగుళ్లు క్రమంగా తగ్గిపోతున్న ట్లుగా అనిపిస్తూ, అద్దంలో చూసుకున్నప్పుడు క్రమంగా దంతాలపై నుంచి చిగురు కిందికి దిగుతున్నట్లుగా అనిపిస్తుంది. చిగుళ్లపై బుడిపెల్లా వచ్చి, అక్కడ చీము పట్టడం. నోటి దుర్వాసన వస్తుండటం.

పళ్లమధ్య సందులు రావడం, దాంతో పంటి మధ్య దూరం పెరిగి తిన్న ఆహార పదార్థాలు అక్కడ ఇరుక్కుపోవడం, అందుకే తిన్న తర్వా తప్రతిసారీ పళ్ల మధ్య సందుల్లో ఆహార పదార్థాలు చేరుతున్నాయనే అంశాన్ని గుర్తిస్తే తప్పనిసరిగా దంతవైత్యులతో పరీక్షలు చేయించుకోవడం అవసరం.

**చికిత్సలు:**

**క్యూరటాజ్...** చిగుళ్ల వ్యాధి జింజివైటిస్ అన్న ప్రాథమిక దశలో ఉంటే క్యూరటాజ్ అనే చికిత్స అవసరమవుతుంది.

**ఫ్లాప్ చికిత్స...**

చిగుళ్ల వ్యాధి జింజివైటిస్ అనే దశను దాటి పెరియోడాంటైటిస్ అనే దశకు చేరితే దానికి ఫ్లాప్ చికిత్స అవసరమవుతుంది.

**బోన్ గ్రాఫ్టింగ్...**

చిగుళ్ల వ్యాధి వల్ల పంటి ఎముక బలహీనమైపోతే దాన్ని దృఢపరచడానికి బ్రోన్ గ్రాఫ్టింగ్ అనే చికిత్స చేయాల్సి ఉంటుంది.

**నివారణ ఇలా...**

ఈ సమస్యలన్నింటినీ నివారించడానికి రోజు రెండుసార్లు ఫ్లోరైడ్ ఉన్న టూత్‌పేస్టుతో బ్రష్ చేసుకోవాలి. పళ్ల మధ్యలో బ్రష్ చేరలేని చోట ఉండే పాచిని తొలగించడానికి ఫ్లాసింగ్ (దారం వంటి దానితో పళ్ల మధ్యన ఉండే ప్రాంతంలో శుభ్ర చేయడం) చేసుకోవాలి. చక్కెర ఎక్కువగా ఉండే పదార్థాలు, పిండిపదార్థాలు ఎక్కువగా ఉండే ఆహారాలను పరిమితంగా తీసుకోవాలి.

నోటికి అతుక్కుపోయే ఆహారాలు, శ్నాక్స్‌ను తక్కువగా తీసుకోవాలి. తందాలకు బలం చేకూర్చే సమతుల పోషకాహారం తీసుకోవాలి. సిగరెట్, ఇతర పొగాకు ఉత్పత్తులను వాడే అలవాటును పూర్తిగా మానేయాలి. పళ్లను శుభ్రం చేయడం అన్నది కేవలం బ్రషింగ్‌వల్ల మాత్రమే సాధ్యంకాదు. అందుకే రోజూ రెండు సార్లు బ్రష్ చేసినప్పటికి, రోజుకు కనీసం ఒకసారి మౌత్‌వాష్‌తో శుభ్రం చేసుకుంటే నోటిలోని బ్యాక్టీరియా పెరుగుదల అదుపులో ఉంటుంది. టూత్‌బ్రష్ అన్నది మెకానికల్ క్లీనింగ్‌కు ఉపయోగపడితే, మౌత్‌వాష్ అన్నది కెమికల్ క్లీనింగ్‌కు ఉపయోగపడుతుంది.

డెంటిస్ట్ సూచించిన షెడ్యూల్ ప్రకారం ప్రతి ఆర్నెల్లకు ఓసారి ఇంటిలోని కుటుంబ సభ్యులంతా స్కేలింగ్ ప్రక్రియ ద్వారా శుభ్రం చేయించుకోవడం అవసరం. దీనివల్ల ఎలాంటి దుష్ప్రభావాలు (సైడ్‌ఎఫెక్ట్స్) ఉండవు. పళ్లు అరిగిపోతాయన్నది, దంతాలు వదులైపోతాయ న్నది, పళ్ల మధ్య సందులు వస్తాయన్నది కేవలం అపోహ మాత్రమే.

**గుర్తుంచుకోవాల్సిన అంశం:**

చిగుళ్ల వ్యాధులు వచ్చినవారిని పరిశీలిస్తే చాలామట్టుకు కుటుంబ సభ్యులలో వంశపారంపర్యంగా ఈ వ్యాధి కనిపించే అవకాశాలు ఎక్కువ. కాబట్టి పళ్లు వదులై పడిపోయిన కుటుంబ చరిత్ర (ఫ్యామిలీ హిస్టరీ) ఉన్నవారు తప్పనిసరిగా దంతవైద్యు డిని సంప్రదించాలి. అంతేకాదు.. చిన్న వయ సులోనే ఎవరికైనా పళ్లు ఊడిపోతే వారి పిల్లలు మరింత జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది.


**జాగ్రత్తలు:**

ఐదేళ్లుగా ఎప్పుడూ దంతవైద్యుడిని కలిసి ఏ రకమైన దంత వైద్య చికిత్సను తీసుకోని వారిలో చిగుళ్ల వ్యాధులు ఉండే అవకాశం చాలా ఎక్కువ. కాబట్టి మీరు ఈకోవలోకి వచ్చేవారైతే తప్పనిసరిగా దంతవైద్యుడిని కలవాలి. కేవలం దంత సంబంధమైన సమస్యలు వచ్చినప్పుడే కాకుండా ప్రతి ఆర్నెల్లకు ఓ మారు విధిగా దంతవైద్యుడితో పళ్ల పరీక్షలు చేయించుకోవాలి. ఇంట్లోని కుటుంబ సభ్యులంతా ఈ నియమాన్ని తప్పనిసరిగా పాటించాలి.

**బ్రషింగ్‌లో జాగ్రత్తలు:**

బ్రష్ చేసుకునేందుకు మృదువైన బ్రిజిల్స్ ఉన్న బ్రష్‌నే వాడండి. కిందివరసలో చిగుళ్లూ, పళ్లూ కలిసే చోటు వరకు నిలువుగా బ్రష్ చేసుకోండి. చాలా మృదువుగా బ్రష్ చేసుకోండి. రఫ్‌గా బ్రష్ చేసుకుంటే అది మీ చిగుళ్లకు హాని చేకూర్చవచ్చు. అలాంటప్పుడు అవి త్వరగా వ్యాధుల బారిన పడే అవకాశం ఉంటుంది. చేత్తో చిగుళ్లపై మృదువుగా మసాజ్ చేసినట్లు రుద్దితే దంతాల ఆరోగ్యం మెరుగుపుడుతుంది.

# కాఫీతో గుండెకు చేటు



యాంత్రిక జీవితంలో కాస్తంత రిలీఫ్ కోసం దమ్ము (పొగ తాగడం) కొట్టడం, ఘుమఘుమలాడే ఓ మంచి కాఫీ లేదా టీ సేవించడం సహజంగా చేస్తుంటాం. ఈ రెండింటిలో పొగ వల్ల కలిగే హాని ప్రత్యేకంగా చెప్పనక్కర లేదు. అదేసమయంలో వెచ్చగా గొంతులోకి జారుతూ సేదతీర్చే కాఫీ సేవనంతో కాస్తంత జాగ్రత్తగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. సాధారణంగా కొందరు వ్యక్తులు అల్పాహారం తీసుకున్న తర్వాత కాఫీ సేవిస్తుంటారు. అలాగే, రోజువారీ విధుల్లో భాగంగా కాస్తంత ఒత్తిడికి గురైనపుడు కూడా కాఫీని తాగుతుంటారు. వాస్తవానికి ఒక రోజుకు ఒకటి లేదా రెండు కప్పులు తీసుకునే కాఫీ ప్రియులు అదనంగా మరో కప్ తీసుకుంటే ఆనారోగ్యానికి ముప్పు తథ్యమని తాజాగా నిర్వహించిన ఒక సర్వేలో వెల్లడైంది. కప్పుల కొద్దీ కాఫీ తాగే వారిలో కెఫీన్ ప్రభావం అధికంగా ఉంటుందన్నారు. ఇది రక్తపు పోటును పెంచుతుందని తద్వారా ధమనులు మొద్దుబారు తుందన్నారు.

పైపెచ్చు.. గుండె వేగాన్ని పెంచే ఒత్తిడి హార్మోన్ స్థాయిలను పెంచుతుందన్నారు. ఈ విషయం అమెరికాకు చెందిన హార్వర్డ్ మెడికల్ స్కూల్ నిపుణులు 400 మందిపై గుండెపోటు బాధితులపై జరిపిన సర్వేలో వెల్లడైనట్టు డైలీ టైమ్స్ పత్రిక పేర్కొంది.

## తమలపాకూ ఓ ఔషధమే!


శరీరానికి తాంబూల సేవనం చాలా ఉపయోగకరమైనది. ఎముకలకు మేలు చేసే కాల్షియం, ఫోలిక్ యాసిడ్, ఎ విటమిన్. సి.విటమిన్ లు తమలపాకులో పుష్కలంగా వున్నాయి. తాంబూలం రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. తమలపాకు ఔషధం లాంటిది. ఔషధాల మాదిరిగానే దీనినీ పరిమితంగానే వాడుకోవాలి. తాంబూలానికి పొగాకును కలిపి తింటే సబ్‌మ్యూకస్ ఫైబ్రోసిస్ వంటి ప్రమా దకరమైన నోటి వ్యాధులు వచ్చే అవకాశం ఉం టుంది. సబ్‌మ్యూకస్ ఫైబ్రోసిస్ అనేది నోటి క్యా న్సర్‌కి ముందు స్థితి. సున్నంవల్ల ఆస్టియో పోరోసిస్ (ఎము కలు గుల్లబారటం) రాకుండా ఉంటుంది; తమలపాకు రసం సున్నంలోని క్యాల్షియంను శరీరాంతర్గత భాగాల్లోకి చేరవేస్తే తమల పాకుకు చేర్చి వక్కపొడి లాలాజలాన్ని విడుదలయ్యేలా చేసి అరుగుదలకు సహాయపడుతుంది. ఔషధంగా తమలపాకుని వాడుకోద లిస్తే, రసం పిండి 1-2 చెంచాల మోతాదులో తీసుకోవాలి. ప్రతి రోజూ 7 తమలపాకులను ఉప్పుతో కలిపి ముద్దగా నూరి వేడి నీళ్లతో తీసుకుంటే బోధ వ్యాధిలో చక్కని ఫలితం కనిపిస్తుంది.

ప్రతి రోజూ రెండు నెలలపాటు ఒక తమలపా కును పది గ్రాముల మిరియం గింజలను కలిపి తిని వెంటనే చన్నీళ్లు తాగుతుంటే స్థూలకాయులు సన్నగా నాజూగ్గా తయారవుతారు. స్వర్ణక్షీరి, విడం గాలు, ఇంగిలీకం, గంధకం, చక్రమర్ధ, చెంగల్వ కోష్టు, సింధూరం వీటిని ఉమ్మెత్త ఆకులతోనూ, వేప చెట్టు బెరడుతోనూ, తమలపాకుతోనూ కలిపి ముద్దగా నూరి చర్మంమీద లేపనం చేస్తే ఎగ్జిమా, తామర, దురదలు వంటి చర్మవ్యాధుల్లో ఉపశ మనం లభిస్తుంది. తమలపాకు రసం, తేనె సమపాళ్లలో కలిపి కళ్లలో డ్రాప్స్‌గా వేసుకోవాలి. (వైద్య పర్యవేక్షణ అవసరం) తమలపాకు రసం, తులసి రసం, అల్లం రసం, మిరియాలు పొడి, తేనె లను కలిపి నాకిస్తే పిల్లల్లో జలుబు, దగ్గు తగ్గు తాయి.

చెవుల మీద తమలపాకులను వేసి కట్టుకుంటే తలలో చేరిన వాతం శాంతించి తల నొప్పి తగ్గుతుంది. తమలపాకు రసాన్ని పాలతో కలిపి తీసుకుంటే మహిళల్లో కనిపించే పిశాచ బాధలు, క్షణికావేశాలు తగ్గుతాయి.




# షాంపూతో తలస్నానం మంచిదేనా?



జట్టు వత్తుగా ఉండాలని..ఆకర్షణీయంగా కనిపించాలని..అందరి దృష్టి తమ మీదనే ఉండాలని తహతహలాడుతుంటారు. కానీ కేశాలతో ఎన్నో సమస్యలు ఎదుర్కొంటుంటారు. ఇందుకు మార్కెట్లో దొరికే ఏవో ఒక షాంపూలు పెట్టుకుని స్నానం చేసేస్తుంటారు. మంచి షాంపూను ఎన్నుకోవడం తెలియని వారికి కొన్ని చిట్కాలు... కురులు ఆరోగ్యంగా ఉండాలంటే షాంపూలే వాడకుండా వాటితో పాటు కండీషనర్లు కూడా వాడాలి. మొదటిసారి షాంపూతో తల కడిగితే మురికి పూర్తిగా పోతుంది. రెండోసారి షాంపూ వాడినప్పుడు తలలో ఉన్న నూనె పార తొలగిపోతుంది. ప్రతి రోజు తలస్నానం చేయాలి. కుదరనిపక్షంలో వారంలో కనీసం రెండు స్సార్లైనా చేయాలి. అప్పుడే జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. షాం పూలు కొనేముందు వాటిపై రాసి ఉన్న వివరాలను చదివితే పి.హెచ్ శాతాని గుర్తించవచ్చు. ఔషధ గుణాలనున్న షాంపూల్లోనూ పి.హెచ్. శాతం లభిస్తుంది. కాబట్టి వీటిని ఎంచుకోవచ్చు. యాసిడ్, బేసిక్, న్యూట్రల్ వంటి రకాల్లో షాంపూలు లభిస్తాయి. బేసిక్ రకాలన్నీ గాఢత ఎక్కువగా ఉన్న షాంపూలని తెలుసుకోవాలి. వీటిని ఎంత తక్కువ వాడితే అంత మంచిది. పి.హెచ్. శాతాన్ని బట్టి షాం పూలను ఎంచుకోవాల్సి ఉంటుంది. పి.హెచ్ శాతం 5.5 ఉన్న షాంపూ లను మాత్రమే వాడాలి. ఈ షాంపూలను వాడడం వల్ల చుండ్రు సమస్య తగ్గే అవకాశం ఉంది. ఎన్నో ఏళ్లుగా వాడుతున్నాం కదా! వాటిని వాడటంలో ఇంకా తప్పులు చేస్తామా అనిపించవచ్చు. కానీ, నిజాలు తెలిసే దాకా కొన్ని తప్పులు అలా కొనసాగుతూనే ఉంటాయి. అందువల్ల ఇంకా దొర్లుతున్నాయేమో ఒకసారి చెక్ చేసుకోవడం మేలు... మార్కెట్లో ఎన్నో రకాల షాంపూలు దొరుకుతుంటాయి. కానీ, వాటిల్లో ఏవి తలకు బాగా సరిపోతాయో తెలుసుకుని వాడటం శ్రేయస్కరం. ప్రత్యేకించి డ్రై, ఆయిలీ, బ్రిటిల్ వీటిల్లో మీ జుత్తు ఏరకానికి సంబంధించిందో మీరు తెలుసుకోవాలి. వాటికి ఏ రకం షాంపూ వాడాలో అవసరమైతే హెయిర్ స్టైలిస్ట్‌ను గానీ, ట్రికాలజిస్టును గానీ ఒకసారి కలవడం మేలు.షాంపూ కమ్ కండీషనర్‌లను మీరు వాడకపోవడమే మంచిది. ఎందుకంటే షాంపూ, కండీషనర్ ఒకే దాంట్లో ఉండడం వల్ల ఏ ప్రయోజనమూ రాదు. వాటిని మానేస్తే, తల ఆరోగ్యానికే కాకుండా అనవసరమైన ఖర్చు కూడా తగ్గుతుంది. ఏ ఒకే రకం షాంపూనూ ఎల్లకాలం వాడకూడదు. అలా వాడటం వల్ల తల మీద ఒక మార్పు వచ్చి ఆ షాంపూ పనిచేయకుండా పోతుంది.షాంపూ వాడటానికి ముందు జుత్తు ఆరి ఉండాలి. లేదంటే అందులోని అంశాలు మీ జుత్తుమీద పనిచేయలేకపోతాయి. దీని కోసం షవర్ కింద రెండు మూడు నిమిషాలు ఉండాలి.

వెంట్రుక చివర్లే కాకుండా వాటి కుదుర్ల మీద కూడా పనిచేయడం షాంపూల ఉద్దేశం. అందువల్ల షవర్ కింద ఉన్నప్పుడు జుత్తు చివర్లతో పాటు వాటి కుదుర్ల దాకా శుభ్రమయ్యేలా చేసుకోవాలి. రోజూ కాకుండా రెండు రోజులకు ఒకసారి మాత్రమే షాంపూను వాడాలి. ఒకవేళ జుత్తు జిగటగా ఉందనిపిస్తే స్వల్పంగా డ్రై షాంపూను వాడవచ్చు. దీనివల్ల జుత్తు ఆకర్షణీయంగా మారుతుంది కూడా.


# వేడినీటి స్నానం ఎక్సర్‌సైజుతో సమానం

లండన్: రోజంతా పనిచేసి అలసిపోయి ఇంటికి రాగానే వేడి నీటితో స్నానం చేస్తే ఎంతో హాయిగా ఉంటుంది. అలసట నుంచి శరీరం, ఒత్తిడి నుంచి మనసు ఉపశమనం పొందుతుంది. ఇవన్నీ మనకు తెలిసిన విషయాలే. కానీ వేడినీటితో స్నాన్నం.. చిన్నపాటి ఎక్సర్‌సైజుతో సమానమని చెబుతున్నారు శాస్త్రవేత్తలు. అంతేకాదు.. ప్రతిరోజూ వేడినీటితో స్నానం చేయడం వల్ల గుండె సంబంధిత సమస్యల బారిన పడకుండా ఉంటామని, రక్తపోటు, మధుమేహం వంటివి కూడా తగ్గుతాయంటున్నారు. 2,300 మందిపై పరిశోధన చేసి ఈ నిర్ణయానికి వచ్చారు. పరిశోధన కోసం ఎంపికచేసిన వారితో 30 నిమిషాలు బ్రిస్క్‌వాక్ చేయించారు. దీంతో వారిలో 140 కేలరీలు ఖర్చయినట్లు గుర్తించారు. ఆ తర్వాత వేడినీటితో సంపూర్ణ స్నానం చేయమన్నారు.

ఈసారి కూడా 140 కేలరీలు ఖర్చయినట్లు గుర్తించారు. అంటే ఓ వేడి నీటి స్నానం.. 30 నిమిషాల బ్రిస్క్ వాకింగ్‌తో సమానమని తేల్చారు. అయితే అరగంట సైక్లింగ్ చేస్తే 630 కేలరీలు ఖర్చవుతాయని, వేడి నీటి స్నానంతో ఇంత పెద్దమొత్తంలో కేలరీలు ఖర్చు కాలేవని గుర్తించారు.

# ఆరిపోయిన లివర్ స్విచ్ వెలిగింది..!



వతీకాలేయం..

మన శరీరంలోని అన్ని అవయవాల్లోకీ పెద్దదీ, ప్రత్యేకమైనదీ. అందుకే రక్తసరఫరా విషయంలో కూడా మిగిలిన అన్ని శరీర భాగాలకు ఒకలా ఉంటే, కాలేయానికి మాత్రం ప్రత్యేకంగా ఉంటుంది. సాధారణంగా శరీర భాగాలన్నింటి నుంచి కార్బన్‌డయాక్సైడ్‌తో కూడిన రక్తం గుండెకు, అక్కడి నుంచి ఊపిరితిత్తులకు చేరుతుంది. ఊపిరితిత్తుల్లో వాయుమార్పిడి ద్వారా కార్బన్‌డయాక్సైడ్ తొలగిపోయి, రక్తంలోకి ఆక్సిజన్ చేరుతుంది. ఈ ఆక్సిజన్‌యుత రక్తం తిరిగి గుండెకు చేరుతుంది. గుండె దీన్ని అన్ని శరీర భాగాలకు సరఫరా చేస్తుంది. శరీరంలో కింది వైపు ఉన్న అవయవాలన్నింటి నుంచి ఇన్‌ఫీరియర్ వీనకావా అనే అతి పెద్ద సిర గుండెకు రక్తాన్ని తీసుకువస్తుంది. అయితే జీర్ణ వ్యవస్థకు చెందిన అవయవాల నుంచి రక్తం కాలేయానికి కూడా సరఫరా అవుతుంది. ఆహారం జీర్ణం అయిన తరువాత రక్తం నుంచి పోషకాలను గ్రహించడానికి అది కాలేయానికి వెళుతుంది. ఇలా జీర్ణవ్యవస్థ నుంచి కాలేయానికి రక్తం సరఫరా అయ్యే మార్గాన్ని పోర్టల్ మార్గం అనీ, ఆ రక్తనాళాన్ని పోర్టల్ సిర అనీ అంటారు. ఇందులో తక్కువగా అంటే దాదాపు 60 శాతం మాత్రమే ఆక్సిజన్ ఉంటుంది. అదేవిధంగా గుండె నుంచి హెపాటిక్ ధమని ద్వారా 98 శాతం ఆక్సిజన్‌ను కలిగివున్న రక్తం కాలేయానికి సరఫరా అవుతుంది.

సాధారణంగా ఏ కారణం వల్లనైనా పోర్టల్ సిర మార్గంలో ఎక్కడైనా రక్తంలో అడ్డంకులు ఏర్పడితే, మందుల ద్వారా వాటిని తొలగించి, అవసరమైన సర్జరీ చేసేస్తారు. కాని పైన చెప్పిన పేషెంటు విషయంలో ఈ అడ్డంకు పోర్టల్ సిరలో ఎక్కడో ఒకచోట అని కాకుండా మొత్తం పోర్టల్ మార్గం బ్లాక్ అయిపోయింది. దీన్ని పోర్టో - మీసెంట్రిక్ థ్రాంబోసిస్ అంటారు. దాంతో కాలేయానికి రక్తసరఫరా ఆగిపోయింది. ఇలాంటి క్లిష్టమైన పరిస్థితిలో కాలేయ మార్పిడి చేయడం దాదాపు అసాధ్యం. విజయవంతం అయ్యే అవకాశం దాదాపుగా ఉండదనే చెప్పాలి. సాధారణ స్థితిలో పేగుల నుంచి రక్తం పోర్టల్ సిర ద్వారా కాలేయాన్ని చేరుతుంది. అదేవిధంగా మిగిలిన శరీర భాగాల నుంచి ఇన్‌ఫీరియర్ వీనకావా ద్వారా గుండెకు చేరుతుంది. ఇక్కడ ఈ రెండు మార్గాలకు మధ్య బ్రిడ్జ్ వేశారన్నమాట. అంటే కాలేయానికి, ఇన్‌ఫీరియర్ వీనకావాకి మధ్యలో ఒక బైపాస్ నాళాన్ని నిర్మించారు. దాంతో రక్తం పేగుల నుంచి ఇన్‌ఫీరియర్ వీనకావాకి, దాని నుంచి గుండెకు, తరువాత గుండె నుంచి కాలేయానికి చేరేలా రూపొందించారు. దీన్నే కావల్ ట్రాన్స్‌పొజిషన్ లేదా కావల్ స్విచ్ ఆపరేషన్‌గా వ్యవహరిస్తారు. పదమూడున్నర గంటల సుదీర్ఘ శ్రమ అనంతరం ఆపరేషన్ సక్సెస్ అయింది. కాలేయ మార్పిడి చేసినప్పటికీ కొత్త కాలేయానికి రక్త సరఫరాలో అంతరాయం లేకపోవడంతో పదిరోజుల్లో రోగి కోలుకునేందుకు వీలయింది. ఎన్ని ట్రాన్స్‌ప్లాంటేషన్లు చేసినా, ఇలాంటి సంక్లిష్టమైన, సవాలుతో కూడిన కేసు ఇదే మొదటిసారి. ఊపితిత్తులు బలహీనంగా ఉన్నప్పటికీ, వెంటిలేటర్ మీద ఉన్న రోగి ఇలా లేచి తిరగడం ఈ ఆధునిక చికిత్స ఫలితమేనంటారు ఆపరేషన్ నిర్వహించిన డాక్టర్ టామ్ చెరియన్. సిర్రోసిస్‌తో కాలేయం దెబ్బతిన్నది. కాలేయ మార్పిడి తప్ప గత్యంతరం లేదు. కాలేయ దాత కూడా అందుబాటులో ఉన్నారు. కాని ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసే పరిస్థితి లేదు. బతికినన్నాళ్లూ బతుకుతాడు.. అంతేగాని కాలేయ మార్పిడితో మరింత ప్రమాదాన్ని తెచ్చిపెట్టలేం అన్నారు డాక్టర్లు. ఏ అవయవానికైనా రక్తసరఫరా సక్రమంగా ఉంటే ఏ చికిత్స అయినా సులువుగా చేయవచ్చు. కాని రక్త సరఫరాలోనే సమస్య ఉంటే..? ఈ సమస్యనే సవాలుగా తీసుకున్నారు డాక్టర్లు. రక్తసరఫరాలో అంతరాయం ఉన్న కాలేయానికి మొట్టమొదటిసారిగా కావల్ ట్రాన్స్‌పొజిషన్(స్విచ్) విధానంలో ట్రాన్స్‌ప్లాంటేషన్ చేశారు కేర్ హాస్పిటల్‌కి చెందిన డాక్టర్ టామ్ చెరియన్.

కాళ్లుచేతుల పైన రోమాలు ఎక్కువగా ఉన్నాయని బాధపడుతున్నారా? దీనిలో కూడా పాజిటివ్ చూడండి. ఇలా ఎక్కువ రోమాలున్నవాళ్లలో తెలివితేటలు, ఐక్యు లెవల్స్ ఎక్కువగా ఉంటాయట. ఒక దశ వచ్చేవరకు మన శరీరంలోని ప్రతి భాగం పెరుగుతూ ఉంటుంది.

యుక్తవయసు వచ్చిన తరువాత వీటి పెరుగుదల ఆగిపోతుంది. కాని చెవి, ముక్కు విషయంలో మాత్రం ఇలా జరగదు. వాటిలో పెరుగుదల ఆగిపోదు. వేళ్లపై ఉండే గుర్తులే (ఫింగర్ ప్రింట్స్) కాదు, నాలుక పైన కూడా టంగ్ ప్రింట్స్ కూడా ఒకరిని పోలి మరొకరికి ఉండవు. అదాదాపు 10 మిలియన్లకు పైగా వివిధ రకాలైన రంగుల షేడ్స్‌ను మన కళ్లు గుర్తించగలుగుతాయి. వాటిలో తేడా కనిపెట్టగలుగుతాయి. మన కన్ను డిజిటల్ కెమెరా లాంటిదే. ఇది 576 మెగా పిక్సెల్ సామర్థ్యాన్ని కలిగివుంది. మన శరీరంలో ఉండే బాక్టీరియా అన్నీ కలిపితే దాదాపు 4 పౌండ్ల బరువు తూగుతాయి. క్యాన్సర్లలో వందకు పైగా రకాలున్నాయి.

# చిత్రభాను

# 'బాడ్కావ్ బలిసిందారా'

## సాయి పల్లవి డైలాగ్ అర్థం తెలిస్తే షాక్!



శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కిన 'ఫిదా' సినిమా పెద్ద హిట్. ఈ సినిమా ఇంత పెద్ద హిట్టయిందంటే.... ప్రధాన కారణం సాయి పల్లవి. ఆమె సినిమాలో మాట్లాడిన తెలంగాణ యాస. భవిష్యత్తులో ఈ సినిమా గురించి అందరూ మరిచిపోయినా సాయి పల్లవి క్యారెక్టర్, ఆమె చెప్పిన డైలాగులు ఎప్పటికీ గుర్తిండిపోతాయి. ఈ సినిమాలో సాయిపల్లవి ఓ సీన్లో 'బాడ్కావ్ బలిసిందారా... బొక్కలిరగ్గొడతా' అంటూ ఓ వ్యక్తిని తిడుతుంది. ఈ డైలాగ్ బాగా పాపులర్ అయింది. ఈ డైలాగులో బలిసిందారా, బొక్కలిరగ్గొడతా అర్థం అందరికీ తెలిసిందే కానీ 'బాడ్కావ్' అంటే ఏమిటో చాలా మందికి తెలియదు. చాలా మంది ఈ పదం అర్థం కోసం నెట్లో అన్వేషిస్తున్నా సరైన జవాబు దొకరడం లేదట. తెలంగాణ ప్రాంతంలో బాడ్కావ్ అనేది సాధారణంగా వినిపించే ఒక చెడ్డ పదం. అయితే దాని అర్థం మాత్రం ఇప్పటి జనరేషన్లో చాలా మందికి తెలియదు. ఇక ఆంధ్రా ప్రాంతం నుండి వచ్చిన వారు ఈ పదం వినడమే చాలా అరుదు. 'బాడ్కావ్' పదానికి అర్థం చాలా మంది 'వెదవ(ఫూల్)' అనుకుంటున్నారు. కానీ అది నిజం కాదు. బాడ్కావ్ అనేది ఒక తిట్టు. ఒకరిని తిట్టే క్రమంలో తెలంగాణలో ఇలాంటి పదాలు వాడుతూ ఉంటారు. వాస్తవానికి దీన్ని తెలంగాణ పదం అనడం కూడా సరికాదు. ఇది 'దక్కని' లాంగ్వేజ్ నుండి వచ్చి పదం. నిజాం నవాబు కాలంలో తెలంగాణ, మరాఠీ, ఉర్దూ ఇలా మూడు మిలితమై ఉండే బాష మాట్లాడే వారు. దీన్నే 'దక్కని' లాంగ్వేజ్ అంటారు.

బాడ్కావ్ అనే పదానికి అర్థం...అమ్మాయిల బ్రోకర్ అని అర్థం. ఈ వర్డ్ క్యాచీగా ఉండటంతో శేఖర్ కమ్ముల ఈ పదాన్ని తన సినిమాలో వాడేశాడు. ఈ డైలాగ్ సాయి పల్లవి నోట రావడంతో మరింత పాపులర్ అయింది. 'బాడ్కావ్' అనేది ఎదుటి వ్యక్తి కించ పరిచే ఒక తిట్టు. ఇపుడు ఇంగ్లీషు, హిందీ, తెలుగు బాషలోని ఇంతకంటే దారుణమైన బూతు పదాలు ఈ తరం జనరేషన్ వాడుతున్నారు. వాటితో పోల్చుకుంటే 'బాడ్కావ్' అనేది అంత సీరియస్ వర్డ్ ఏమీ కాదు.

# ధనుష్ వెబ్ సిరీస్



నటుడిగానే కాదు దర్శక నిర్మాతగా ధనుష్ కి మంచి అనుభవముంది. అలాంటి ధనుష్ ఇప్పుడు వెబ్ సిరీస్ పై దృష్టి పెట్టాడని తెలుస్తోంది. రెండు సంవత్సరాల క్రితమే ఆయన వెబ్ సిరీస్ కి దర్శకత్వం చేయాలనుకున్నాడట. అయితే అప్పుడున్న కమిట్మెంట్స్ వలన అది సాధ్యపడలేదు. ఇప్పటికే హిందీ - తెలుగు వంటి సినీ పరిశ్రమల్లో ఓ మార్కెట్ ను తెచ్చుకున్న ధనుష్ ఇప్పుడు దాన్ని రెట్టింపు చేసేందుకు సిద్దపడుతున్నాడట. త్వరలో ఓ వెబ్ సిరీస్ ద్వారా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు ధనుష్ చెప్పేశాడు. అది కూడా ఆయన దర్శకత్వంలోనే ఉంటుందట. రెండేళ్ల క్రితమే వెబ్ సిరీస్ స్టార్ట్ చెయ్యాలని ప్లాన్ చేసుకున్న ధనుష్ వీఐపీ 2 షూటింగ్ లో బిజీగా ఉండడం వలన కుదరలేదట. సినిమానుంచి ఈ మధ్య వెబ్ సిరీస్ వైపు చూపు మళ్ళిస్తున్నారు దర్శకులూ నిర్మాతలూ అంతా. వచ్చే జనరేషన్ వెబ్ సిరీస్ లదే అనీ, తాను ఇక మీదట వరుసగా వెబ్ సిరీస్ లు తీయబోతున్నాను అని చెప్పిన రామ్ గోపాల్ వర్మ "గన్స్ అండ్ థైస్ అంటూ" తన తొలి వెబ్ సిరీస్ ట్రైలర్ తోనే సంచలనం రేపాడు. ఇక ఇప్పుడు చాలామంది నటులూ దర్శకులూ వెబ్ సిరీస్ ల బాటపట్టారు. సో..! ధనుష్ కూడా తన ప్రయత్నాలు మొదలు పెట్టాడు. వెబ్సిరీస్ మరీ కొత్త ట్రెండేం కాదు. జోరందుకుంది మాత్రం ఇప్పుడే. పర్మనెంట్ రూమ్మేట్స్, లవ్ బైట్స్, గర్ల్ ఇన్ ద సిటీ, ఐషా... అంటూ ఉత్తరాదిని ఎప్పుడో వూపేశాయివి. సౌత్ లో ఈ హల్చల్ మొదలైంది మాత్రం ఏడాది కిందటే. అయినా మార్కెట్ బావుండటం, సినిమాలో ఉన్నట్టు సెన్సార్, రిలీజ్ సమస్యలు కూడా ఉండకపోవటం వంటి అడ్వాంటేజ్ లు చాలానే ఉన్నాయి. దీంతో వచ్చే ఏడాది తప్పకుండా వెబ్ సిరీస్ ను స్టార్ట్ చెయ్యాలని డిసైడ్ అయ్యాడట. ధనుష్ రెండు నెలల క్రితం దర్శకత్వం వహించి రిలీజ్ చేసిన పా పాండి సినిమా పాజిటివ్ టాక్ ను తెచ్చుకుంది. దీంతో వెబ్ సిరీస్ కథను రెడీ చేసుకొని మరి కొంత మంది రచయితల సహకారంతో మంచి కథనాన్ని డెవలప్ చేస్తున్నాడట.



# ఇక 192 దేశాల్లో బాహుబలి...

## ఇప్పటివరకున్న లెక్కలు ఇవే!

రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన బాహుబలి సీరీస్ సినిమాలు ఇండియన్ సినిమా చరిత్రలో సరికొత్త రికార్డులు క్రియేట్ చేసిన సంగతి తెలిసిందే. బాహుబలి సిరీస్లోని రెండు చిత్రాలు దేశంలో విడుదలైన అన్ని భాషల్లో బాక్సాఫీసు వద్ద సంచలన విజయం సాధించాయి. ఈ ఏడాది విడుదలైన బాహుబలి-2 మూవీ ఎవరూ ఊహించని ఘన విజయం సాధించింది. ఇండియన్ సినిమా పరిశ్రమ అప్పటి వరకు చూడని రూ. 1000 కోట్లు, రూ.1500 కోట్ల మార్కును నిర్మాతలకు చూపించిన తొలి సినిమా ఇదే. బాహుబలి 2 మూవీ ఇప్పటి వరకు రూ. 1700 కోట్ల వసూళ్లు సాధించింది. ఇండియన్ సినీ చరిత్రలో ఇది అతిపెద్ద మొత్తం. దేశం మొత్తం ఒక సినిమాను పిచ్చి పిచ్చిగా చూస్తే రిజల్ట్ ఎలా ఉంటుందో చెప్పడానికి ఇదో నిదర్శనం. ఇండియన్ బాక్సాఫీసు వద్ద అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రం 'బాహుబల-2' మాత్రమే. అమీర్ ఖాన్ 'దంగల్' మూవీ చైనాలో రిలీజ్ అయి అక్కడ భారీ విజయం సాధించడం వల్ల భారీ వసూళ్లు సాధించిందే తప్ప... డొమెస్టిక్ బాక్సాఫీసు వద్ద బాహుబలిని దాటలేక పోయింది. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం 'బాహుబలి' సిరీస్ లోని రెండు సినిమాలు ఇక ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 192 దేశాల్లో అందుబాటులోకి రానున్నాయి. ఆన్ లైన్ స్ట్రీమింగ్ రైట్స్ ఇటీవలే అమ్ముడైనట్లు సమాచారం. ప్రపంచంలోని అన్ని దేశాల్లో ఈ సినిమా ఆన్ లైన్ ద్వారా అందుబాటులోకి రాబోతోంది. ఈ రైట్స్ 4 మిలియన్ యూఎస్ డాలర్లకు అమ్ముడైనట్లు సమాచారం. తమ సినిమా ద్వారా తెలుగు సినిమా ఖ్యాతి 192 దేశాలకు వ్యాప్తి చెందడం ఆనందంగా ఉందని, ఇలాంటి సినిమాలో తామూ భాగమైనందుకు సంతోషంగా ఉందని నిర్మాతలు వెల్లడించారు.



# వరుస ఫ్లాపులు కానీ.. రేటు మాత్రం వంద కోట్లు

హృతిక్ రోషన్కి ఈమధ్య కాలంలో చెప్పుకోతగ్గ హిట్ రాలేదు. 'క్రిష్' సిరీస్ చిత్రాలతో సూపర్హీరోగా మారిన హృతిక్రోషన్ సినిమా వస్తుందంటే అభిమానులు చాలా అంచనాలు పెట్టుకుంటారు. స్టార్ హీరోగా కొనసాగుతున్న హృతిక్ కాబిల్ లో అంధుడిగా నటించడం ప్రేక్షకుల్లో అంచనాలను పెంచేసింది. గతేడాది హృతిక్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని నటించిన 'మొహెంజొదారో' చిత్రం ఆశించిన విజయం సాధించలేకపోయింది.ఈ సారైనా పెద్ద హిట్ ఇస్తాడు అనుకుంటే "బలం" లో అసలు బలమే లేకపోవటం తో చతికిల బడ్డాడు హృతిక్. నిజానికి గతకొంత కాలంగా సరైన హిట్ కోసం ఎదురు చూస్తూనే ఉన్నాడు హృతిక్. గతసంవత్సరం వచ్చిన మొహంజో దారో, కాబిల్ లాంటి భారీ ఆశలు పెట్టుకున్న సినిమాలు కూడా దారుణం గా దెబ్బతిన్నాయి. ఇప్పుడు ఉన్న పోటీని తట్టుకోవటానికి హృతిక్ కి ఖచ్చితంగా ఒక హిట్ అవసరం. ఒకదాని వెనుక ఒకటి వరుసపెట్టి పరాజయాలు వేధిస్తోన్న ఈ తరుణంలో హిట్ ఎలా ఇవ్వాలా అని అతను తల పట్టుకున్నాడు. అయితే ఎన్ని ఫ్లాప్స్ వచ్చినా కానీ హృతిక్ రేంజ్ ఏమీ మారలేదని, అతని బ్రాండ్ వేల్యూ అలాగే వుందని నిరూపిస్తూ ఒక ఫిట్నెస్ కంపెనీ అతనితో వంద కోట్లకి డీల్ కుదుర్చుకుంది. ఈ మధ్యన ఈయన తండ్రి రాకేష్ రోషన్ మాత్రం క్రిష్-4 మీద వర్క్ నడుస్తోందని చెప్పాడు. మొత్తానికి అటు సినిమాలు లేక పోవటం తో ఉన్నసమయాన్ని ఇలా బట్టలిప్పేసి తన టామీ హిల్ఫిగర్ బ్రాండ్ బట్టల కోసం ఫోజులు ఇస్తున్నాడు. పనిలో పనిగా ఇంకో డీల్ కూడా కుదుర్చుకున్నాడు. హృతిక్ అయిదేళ్ల పాటు క్యూర్-ఫిట్ అనే సంస్థకి అంబాసిడర్గా ఉండటానికి గానూ భారీ ఆఫర్ అందుకున్నాడు. ఈ అయిదు సంవత్సరాలకు గానూ అతనికి వంద కోట్లు చెల్లిస్తారు. దీనికి సంబంధించిన ఒప్పందాలు జరిగిపోయాయి. హృతిక్కి చెందిన హెచ్ఆర్ఎక్స్ సంస్థతో కలిసి అసోసియేట్ అయి క్యూర్.ఫిట్. ఒక ఫిట్నెస్ ప్రోగ్రామ్ని ఇండియాలో లాంఛ్ చేస్తోంది. హృతిక్ కంపెనీ ఇంట్రడ్యూస్ చేసిన వర్కవుట్ ప్లాన్ని క్యూర్-ఫిట్. విస్తృతం చేయనుంది.

# పాపం కాజల్: కోర్టు చివాట్లు పెట్టింది



కాజల్ కి కోర్టు గట్టిగానే వార్నింగ్ ఇచ్చింది. వీవీడీ కొబ్బరినూనె తయారీ సంస్థపై కాజల్ వేసిన పిటిషన్ను కోర్టు కొట్టేసింది. అంతేకాకుండా ఇప్పటివరకు ఆ కంపెనీకి అయిన కోర్టు ఖర్చంతా కూడా కాజల్ అండ్ కో పెట్టుకోవాలని కోర్టు తీర్పునిచ్చింది. కేసు వివరాల్లోకి వెళితే.. 2008లో వీవీడీ కొబ్బరినూనె ప్రకటనలో నటించడానికి ఆ సంస్థతో కాజల్ ఎగ్రిమెంట్ చేసుకుంది. ఒక్క ఏడాదిపాటే ప్రసారంచేయాలనే నిబంధనతోనే ఆ ప్రకటనలో నటించానని, కానీ దాన్ని ఆ తర్వాతా ప్రసారంచేశారని ఆరోపిస్తూ ఆమె 2011లో మద్రాసు హైకోర్టులో కేసు వేసింది. ఒప్పందం ముగిసినప్పటికి తన ఫోటోను ఆ సంస్థ వాడుకుంటుందని అందుకు నష్టపరిహారంగా ఆ సంస్థ రెండున్నర కోట్లు చెల్లించాలంటూ ఆదేశం ఇవ్వాలని కాజల్ కోర్టుని కోరింది. దీనిపై తుది విచారణ జరిపిన జడ్జి జస్టిస్ టీ రవీంద్రన్ 60 సంవత్సరాల పాటు ఆ యాడ్ పై హక్కులు ఆ సంస్థకి ఉంటాయని తెలిపింది. ఈ క్రమంలో యాడ్ ని ఏడాది తర్వాత ప్రసారం చేయకూడదని కాజల్ డిమాండ్ చేయడం తప్పు అని అన్నారు. దీంతో కాజల్ కి కోర్టులో చుక్కెదురైంది. అసలు నిజానికి కాజల్ కోర్టుకు ఎక్కటానికి కారణం ఏంటంటే... కాజల్ ఆ యాడ్ చేశాక అమ్మడికి ఒక పెద్ద బ్రాండ్ కోకోనట్ ఆయిల్ యాడ్ వచ్చింది. ఈ కొత్త యాడ్ చేసుకోవాలంటే పాత యాడ్ తాలూకు వారి డీల్ ను క్యాన్సిల్ చేసుకోవాలి.

అందుకని తెలివిగా వ్యవహరించి అమ్మడు ఇలా కోర్టుకు ఎక్కింది. అయితే కాపీరైట్స్ చట్టప్రకారం ఒక ప్రకటన దాన్ని రూపొందించిన సంస్థకే చెందుతుందన్నారు.

అంతే కాకుండా 60ఏళ్ల వరకు వాణిజ్యప్రకటన ప్రమోషన్ హక్కులు వారికి ఉంటాయని చెబుతూ.. ఒక్క ఏడాదిలోనే ఆ ప్రకటనను ప్రసారం చేయాలని హక్కులేదని, ఒక వాణిజ్యప్రకటన ప్రమోషన్ హక్కులు ఆ సంస్థకు 60 ఏళ్ల వరకూ ఉంటాయని తీర్పు చెప్పారు.

# సాగును పండుగ చేయడమే సీఎం లక్ష్యం

- ఎస్సారెస్పీ పునర్జీవ సభను విజయవంతం చేయాలి
- గొల్లకుర్మలు సంఘీభావం తెలుపాలి
- నిజామాబాద్ ఎంపీ కవిత



జగిత్యాల: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు సీఎం కేసీఆర్ ప్రయత్నిస్తున్నారు. కాళేశ్వరం నుంచి రివర్స్ పంపింగ్ ద్వారా ఎస్సారె-స్పీని నింపే ఎత్తిపోతల పథకానికి గురువారం పోచంపాడ్‌లో శంకుస్థాపన చేశారు. పునర్జీవ పథకంతో ఎస్సారెస్పీ ప్రాజెక్టు జీవనదిగా మారబోతున్నది అని నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత చెప్పారు. శంకుస్థాపన సభకు లక్షలాదిగా ప్రజలు హాజరుకావాలని పిలుపునిచ్చారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో కులసంఘాల నాయకులతో ఆమె సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా ఎంపీ కవిత మాట్లాడుతూ పునర్జీవ పథకంతో లాభపడే జిల్లాల్లో జగిత్యాల జిల్లా మొదటిదని చెప్పారు. రైతుల కోసం ప్రభుత్వం ఏం చేస్తున్నదో తెలియజేసే ఈ సమావేశానికి రైతులు, ఇతరవర్గాలు హాజరయ్యేలా చూడాల్సిన బాధత్య మనపై ఉన్నదన్నారు. అందుబాటులో ఉన్న బస్సులు, ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాలు, సైకిళ్లను ఉపయోగించుకొని సభకు హాజరుకావాలని కోరారు. గొల్లకుర్మల అభివృద్ధికి పాటు పడుతున్న టీఆర్ఎస్ ప్రభుత్వానికి వెన్నుదన్నుగా నిలువాల్సిన అవసరం ఉన్నదన్నారు.

## జడేజా, అశ్విన్ ఉంటే

# ఎదురుచూపులే..?



న్యూఢిల్లీ : జట్టులో రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్ లాంటి మేటి బౌలర్లు ఉంటే.. అవకాశం కోసం ఎదురుచూడక తప్పదని చైనామన్ బౌలర్ కుల్దీప్ యాదవ్ అభిప్రాయపడ్డాడు. శ్రీలంకతో ముగిసిన రెండు టెస్టుల్లోనూ రిజర్వ్ బెంచ్‌కే పరిమితమైన కుల్దీప్ యాదవ్.. మూడో టెస్టుకి నిషేధం కారణంగా జడేజా దూరమవడంతో తుది జట్టులో తనకి అవకాశం దక్కుతుందనే ధీమాలో ఉన్నాడు. అయితే.. జడేజా స్థానంలో మరో స్పిన్నర్ అక్షర్ పటేల్‌ని బీసీసీఐ సెలక్టర్లు తాజాగా ఎంపిక చేయడంతో ఇప్పుడు కుల్దీప్‌కి పోటీనెలకొంది. శనివారం నుంచి మూడో టెస్టు ప్రారంభంకానున్న నేపథ్యంలో మీడియాతో కుల్దీప్ మాట్లాడాడు జట్టులో నెం.1, నెం.2 టెస్టు బౌలర్లైన జడేజా, అశ్విన్ లాంటి వారు ఉంటే మరో స్పిన్నర్ అవకాశం కోసం ఎదురుచూడక తప్పదు. వీరి పోటీని ఎదుర్కొని తుది జట్టులో స్థానం సంపాదించడం అంత సులభం కాదు. అవకాశం కోసం ఎదురుచూడటమే క్రికెట్ ప్రాథమిక నియమం. అయితే.. గత ఆరు నెలలుగా వారితో కలిసి డ్రెస్సింగ్ రూమును పంచుకోవడం చాలా ఆనందంగా ఉంది.

## లంకతో వన్డే సిరీస్‌కి

# కోహ్లా దూరం?




దిల్లీ : భారత క్రికెట్ అభిమానులకు చేదువార్త. శ్రీలంకతో త్వరలో ప్రారంభం కానున్న వన్డే సిరీస్ భారత క్రికెట్ జట్టు సారథి విరాట్ కోహ్లా దూరం కానున్నట్లు సమాచారం. వరుస సిరీస్‌ల కారణంగా కోహ్లాతో పాటు జట్టులోని పలువురు ఆటగాళ్లకు విశ్రాంతి కల్పించాలని బీసీసీఐ భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే కోహ్లా, రవీంద్ర జడేజా, ఉమేశ్ యాదవ్, రవిచంద్రన్ అశ్విన్, మహమ్మద్ షమిని వన్డే సిరీస్‌కి దూరం కానున్నారు. ఆతిథ్య లంకతో భారత్ ఐదు వన్డేల సిరీస్ ఆడనుంది. ఈ నెల 20న తొలి వన్డే ప్రారంభం కానుంది.

ఐపీఎల్, ఛాంపియన్స్ ట్రోఫీ, వెస్టిండీస్, శ్రీలంక.. వరుస పర్యటనల కారణంగా ఆటగాళ్లు విశ్రాంతి లేకుండా గడుపుతున్నారని.. ఈ క్రమంలోనే వారికి విరామం కల్పించాలని బోర్డు ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. కోహ్లా స్థానంలో సారథి బాధ్యతలను రోహిత్ శర్మకు అందించాలని బోర్డు భావిస్తోంది. ఐపీఎల్‌లో ముంబయి ఇండియన్స్ జట్టుకి కెప్టెన్‌గా ఉన్న రోహిత్ మూడోసారి ట్రోఫీ గెలవడంలో కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. అభిమానులకు చేదువార్త అయినా యువ ఆటగాళ్లకు ఇది శుభవార్తే. సీనియర్ ఆటగాళ్ల స్థానంలో జట్టులోకి వచ్చేందుకు ప్రధానంగా అక్షర్ పటేల్, యుజ్వేంద్ర చాహల్, కుల్‌దీప్ యాదవ్, బసిల్ థంపి పేర్లు వినిపిస్తున్నాయి.

మూడు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఇరు జట్ల మధ్య ఈ నెల 12న చివరి టెస్టు ప్రారంభంకానుంది.

# ఘనంగా పరిటాల శ్రీరామ్ నిశ్చితార్థం



హైదరాబాద్ : ఏపీ మంత్రి పరిటాల సునీత తనయుడు పరిటాల శ్రీరామ్ నిశ్చితార్థం ఘనంగా జరిగింది. హైదరాబాద్ లోని ఎన్ కన్వెన్షన్ సెంటర్ లో ప్రముఖుల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. బంధుమిత్రులు హాజరై శ్రీరామ్-జ్ఞాన జంటను ఆశీర్వదించి, అభినందించారు.

హిందూపురం ఎమ్మెల్యే, నటుడు బాలకృష్ణ ఈ కార్యక్రమానికి ప్రధాన ఆకర్షణగా నిలిచాడు. స్పీకర్ కోడెల, మంత్రులు దేవినేని, అయ్యన్నపాత్రుడు, కామినేని శ్రీనివాస్ , ఎమ్మెల్యేలు వల్లభనేని వంశీ, ఏపీ మహిళా కమిషన్ చైర్మన్ నన్నపనేని రాజకుమారి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. వీరితో పాటు అనంతపురం జిల్లాకు చెందిన టీడీపీనేతలు పయ్యావుల కేశవ్, కాలువ శ్రీనివాసులు, పరిటాల రవి అనుచరుడు చమన్ లు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

సొంత జిల్లా అమ్మాయినే పెళ్లి చేసుకుంటున్నాడు శ్రీరామ్. అనంతపురం జిల్లాకే చెందిన కాంట్రాక్టర్ వెంకటరమణ కూమార్తె జ్ఞాన. వీరి పెళ్లి అక్టోబర్ ఒకటో తేదీన జరగనుంది.

# సామాజిక ఉద్యమాలతోనే పేదలకు న్యాయం




ఇబ్రహీంపట్నం: సామాజిక ఉద్యమాలతోనే రాష్ట్రంలోని పేదలక న్యాయం జరుగుతుందని ప్రజాగాయకుడు గద్దర్ అన్నారు. ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో తెలంగాణ సామాజిక ప్రజాసంఘాల ఐక్యవేదిక(టీమాస్) రంగారెడ్డి జిల్లా ఆవిర్భావ సభ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములుతో కలిసి ఆయన మాట్లాడారు. కోటి ఆశలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో నేడు దొరల పాలన సాగుతోందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న భాజపా ప్రభుత్వం మతోన్మాదాన్ని పోషిస్తుందని ఆరోపించారు. బంగారు తెలంగాణ కాదు బతుకునిచ్చే తెలంగాణ కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. గతంలో జీఎస్‌టీ బాగుందని చెప్పిన కేసీఆర్ నేడు జీఎస్‌టీతో తీవ్ర అన్యాయం జరుగుతుందని మాట్లాడుతుండడం శోచనీయమన్నారు.

# మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ దీక్ష విరమణ

**మాట నిలుపుకోని కేసీఆర్**

**వైద్య కళాశాల ఏర్పాటుచేసే వరకు పార్టీ అండ**

**కేంద్ర మాజీ మంత్రి జైపాల్ రెడ్డి**



కరీంనగర్: కరీంనగర్‌లో వైద్య కళాశాల ఏర్పాటు చేస్తానని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా ప్రకటించి మాట నిలుపుకోలేదని కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి ఆరోపించారు. కళాశాల ఏర్పాటు కోరుతూ అయిదు రోజులుగా ఆమరణ దీక్ష కొనసాగిస్తున్న మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌ను జైపాల్‌రెడ్డి పరామర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా దీక్షకు సంబంధించిన అంశాలను, పత్రికల క్లిప్పింగ్‌లను రాష్ట్ర శాసనసభా పక్ష ఉప నేత జీవన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు మృత్యుంజయం, ఇతర నేతలు జైపాల్‌రెడ్డికి వివరించారు. ఈనెల 5 నుంచి 8వ తేదీ వరకు దీక్షను ప్రభాకర్ నివాసం వద్దే నిర్వహించామని, పోలీసులు దీక్షను భగ్నం చేసి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినా అన్నపానీయాలు ముట్టకుండా దీక్ష కొనసాగిస్తున్నారని చెప్పారు. కరీంనగర్‌లోని ఇందిరాచౌక్ వద్ద దీక్ష నిర్వహణకు పోలీసులు అనుమతించలేదని పేర్కొన్నారు. దీక్షకు సంబంధించిన అంశాలు విన్న తరువాత అక్కడ ఉన్న విలేఖరులను జిల్లా అధ్యక్షుడు మృత్యుంజయం కొంతసేపు బయటకు వెళ్లాలని, తాము సమావేశమై నిర్ణయం తీసుకోవాలని చెప్పారు. అనంతరం ప్రభాకర్ దీక్ష విరమణకు ఒప్పించారు. ప్రభాకర్‌కు జైపాల్‌రెడ్డి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆవేశపరుడు, సమరోత్సాహం కలిగిన వ్యక్తి ప్రభాకర్ దీక్షను పట్టుదలతో చేపట్టారని పేర్కొన్నారు. కరీంనగర్‌లో కళాశాల ఏర్పాటు చేసే వరకు పార్టీ అండగా ఉంటుందన్నారు.

కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ప్రభాకర్ ఆరోగ్యరీత్యా దీక్ష విరమణకు అంగీకరించి నందుకు అభినందనలు తెలిపారు. అయిదు రోజులుగా కొనసాగిన దీక్షకు తెరాస మినహా మాతో కలిసిరాని భాజపాతో పాటు మిగిలిన పార్టీలు, ప్రజా సంఘాలు వైద్య కళాశాల దీక్షకు అండగా నిలిచినందుకు దన్యవాదాలు తెలిపారు. దీక్ష ఒక్కటే ఆందోళన కాదని ఇతర పద్ధతుల్లో కళాశాల ఏర్పాటుకు ఒత్తిడి తీసుకొస్తామన్నారు. కరీంనగర్‌ను లండన్, ప్యారిస్ చేస్తానన్న ముఖ్యమంత్రి అది ఎలా ఉన్నప్పటికీ కళాశాల మాత్రం కరీంనగర్‌లో అవసరమన్నారు. వైద్యకళాశాల అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంతో ప్రభాకర్ సఫలీకృతుడయ్యాడని అన్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి రోజురోజుకు దెబ్బతింటుందని ఇలాగే కొనసాగితే వైద్యం అందించే సౌకర్యం కరీంనగర్‌లో లేకుండా పోతుందని వైద్యులు చెప్పిన మేరకు జిల్లా నేతలతో చర్చించి దీక్ష విరమణకు నిర్ణయం తీసుకున్నామన్నారు.

# అనిల్ కుంబ్లే ఆత్మాభిమానం చంపుకోడు..!

న్యూఢిల్లీ : భారత మాజీ కోచ్ అనిల్ కుంబ్లే ఆత్మాభిమానం చంపుకోకుండా పదవి నుంచి వైదొలగి సరైన నిర్ణయం తీసుకున్నాడని మాజీ కెప్టెన్ మహ్మద్ అజహరుద్దీన్ ప్రశంసించాడు. జూన్‌లో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ ముగిసిన రెండు రోజులకే కోచ్ పదవికి అనిల్ కుంబ్లే రాజీనామా చేసిన విషయం తెలిసిందే. కెప్టెన్ కోహ్లికి తన కోచింగ్ శైలి నచ్చకపోవడంతోనే తాను బాధ్యతల నుంచి పక్కకి తప్పుకుంటున్నట్లు కుంబ్లే ప్రకటించాడు. తాజాగా అజహరుద్దీన్.. కుంబ్లే వ్యక్తిత్వంపై మీడియాతో మాట్లాడాడు. కుంబ్లే అలా పక్కకి తప్పుకోవడం నాకు చాలా బాధ కలిగించింది.

ఉన్నతమైన వ్యక్తిత్వం కలిగిన అతనికి ఈ విధంగా జరిగి ఉండకూడదు. నాకు తెలిసి ఎవరినీ ఇబ్బంది పెట్టే మనస్తత్వం కుంబ్లేది కాదు. బహుశా.. ఆత్మాభిమానం వదులుకోవడం కంటే కోచ్ బాధ్యతల నుంచి తప్పుకోవడమే మంచిదని అతను భావించి ఉంటాడు. అతను సరైన నిర్ణయమే తీసుకున్నాడని నాకు అనిపిస్తోంది అని అజహరుద్దీన్ అభిప్రాయపడ్డాడు. కుంబ్లే రాజీనామా తర్వాత రవిశాస్త్రిని భారత జట్టు ప్రధాన కోచ్‌గా బీసీసీఐ నియమించిన విషయం తెలిసిందే.






# రాజధానిలో ప్లాస్టిక్ సంచులపై నిషేధం



దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో 50 మైక్రాన్ల కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్ సంచులపై మధ్యంతర నిషేధం విధిస్తూ జాతీయ హరిత ట్రైబ్యునల్(ఎన్‌జీటీ) ఆదేశాలు జారీ చేసింది. ఎన్‌జీటీ ఛైర్‌పర్సన్ జస్టిస్ స్వతంత్ర కుమార్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ సంచులను వినియోగిస్తే రూ.5000 జరిమానా విధిస్తామని హెచ్చరించారు. దాంతో పాటు గురువారం నుంచి వారం రోజుల్లో 50 మైక్రాన్ల కన్నా తక్కువ ఉన్న ప్లాస్టిక్ బ్యాగులను అన్నింటినీ స్వాధీనం చేసుకోవాల్సిందిగా దిల్లీ ప్రభుత్వాన్ని ఆదేశించారు. ప్లాస్టిక్, వ్యర్థాల నియంత్రణను తగ్గించేందుకు ఆమ్ ఆద్మీ ప్రభుత్వం, దిల్లీ కాలుష్య నియంత్రణ కమిటీ ఎటువంటి చర్యలు తీసుకుంటుందనే దానిపై సీనియర్ అధికారులతో కలిసి అఫిడవిట్‌ను రూపొందించి సమర్పించాల్సిందిగా ఎన్‌జీటీ ఆదేశించింది.

గతేడాది దిల్లీ, ఎన్‌సీఆర్ పరిధిలోని డిస్పోజబుల్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధిస్తున్నట్లు గ్రీన్ ప్యానెల్ ప్రకటించిన విషయం తెలిసిందే. వ్యర్థ పదార్థాలను వీలైనంత మేర తగ్గించేందుకు ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టింది. కూరగాయలు,

మాంసం దుకాణదారులు బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేస్తే రూ.10వేలు జరిమానా చెల్లించాల్సి వస్తుందని గతంలోనే హెచ్చరించింది. గత నెల మధ్యప్రదేశ్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ సంచులపై నిషేధం విధిస్తున్నట్లు ప్రవేశపెట్టిన బిల్లుకు ఆ రాష్ట్ర అసెంబ్లీ ఆమోదం తెలిపిన సంగతి విదితమే.

VIJAYABHANU - Hyderabad

Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published from ANH Apartments, Block-A, Flat No. 508, Bazar Ghat, Red Hills, Hyderabad-500 004. and printed at **VIJAYABHANU PRESS**, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003. R.N.I. No. 37754/81. Postal Regd. No. H-HD-1017/2006-08, Phone : 040 23370933, Fax : 040 66770933, Cell: 9701529570 ☆ e-mail: vijayabhanudaily@gmail.com